జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

రంగారెడ్డి | శనివారం 3 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 234 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## అమరావతి.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్

- ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం కాదు
- ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్
- రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపం
- ఉగ్రవాదంపై పోరులో కేంద్రం తీసుకునే ప్రతి చర్యకూ అండగా ఉంటాం : సీఎం చంద్రబాబు







# అమరావతికి సహకరిస్తాం

- ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు... అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి
- స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతం... వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి
- చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు.. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది
- "ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు... పవన్ జీ.. ఇది మనమే చేయాలి

ప్రజాజ్యోతి అమరావతి

అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. "దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది" అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. - మిగతా3లో

## భారతదేశానికి తలమానికం అమరావతి

- అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారు
- "గత ఐదేళ్ళ అమరావతి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు
- లాఠీ దెబ్బలు కూడా తిన్నారు.. అమరావతి రైతులు మరిచిపోలేని పోరాటం చేశారు
- అమరావతే ఏపీ రాజధానిగా ఉంటుందని ఆనాడు మాట ఇచ్చాం





## ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం

- దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుంది
- మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించింది.
- పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన వ్యూహం కనిపించలేదు
- రాహుల్ గాంధీ కాన్పూర్‌లో చనిపోయిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలిశారు.
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

## నరేంద్ర మోదీ ఓ మిస్సైల్



- నమో దెబ్బకు.. పాకిస్తాన్ తోకముడవటం ఖాయం..
- ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంది
- పాకిస్తాన్ గీత దాటి, అమాయకులని చంపి చాలా పెద్ద తప్పు చేసింది
- వంద పాకిస్తాన్‌లకు సమాధానం చెప్పగలిగే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది

ప్రజాజ్యోతి అమరావతి

ప్రధాని నరేంద్ర మోదీ కొట్టే దెబ్బకు.. పాకిస్థాన్ తోకముడవటం ఖాయమని మంత్రి నారా లోకేష్ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో చనిపోయిన కుటుంబాలకు నివాళులర్పించారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉందన్నారు. పాకిస్తాన్ గీత దాటి, అమాయకులని చంపి చాలా పెద్ద తప్పు చేసిందన్నారు. ఒక్క పాకిస్తాన్ కాదు.. వంద పాకిస్తాన్‌లు వచ్చినా కూడా భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేవని చెప్పారు. - మిగతా3లో

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు



- సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట
- ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్
- వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ

ప్రజాజ్యోతి విజయవాడ

వైసీపీని ప్రక్షాళన చేసే పనిలో ఆపార్టీ అధినేత జగన్ తలమునకలయ్యారట. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ నడుస్తోంది. సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట. ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇకనుంచి పార్టీలో వికేంద్రీకరణ విధానం తీసుకురావాలని చూస్తున్నారట.వైసీపీలో దిగువ స్థాయి నుంచే పార్టీ ఎదగాలని వారే బాధ్యులుగా మారి సమర్ధంగా పనిచేయాలని ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. అందుకే మొన్నటి - మిగతా3లో



## సిక్కు ఆర్మీ సైనికులకు రెచ్చగొట్టేలా..

- ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ సందేశం
- పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేస్తే సిక్కు సైనికులు పోరాడవద్దని
- సిక్కులకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ 'స్నేహపూర్వక' దేశం
- 'భారతదేశం పాకిస్థాన్‌పై దాడి చేస్తే, అది భారతదేశానికి, ప్రధాని మోదీకి చివరి యుద్ధం అవుతుంది

## రాజ్ కెసిరెడ్డిని కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు



ప్రజాజ్యోతి అమరావతి

మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని విజయవాడ జిల్లా జైలు నుంచి విచారణ నిమిత్తం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. జిల్లా జైలు నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం విచారణకు ఆయన్ను కార్యాలయానికి తీసుకువెళ్లారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని వారం రోజులపాటు సిట్ కస్టడీకి ఇస్తూ విజయవాడ - మిగతా3లో



## కమ్ముకున్న యుద్ధ మేఘాలు

- పాక్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో భారత్ ఫైటర్ జెట్‌లు
- ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలు చేస్తున్నయుద్ధ విమానాల్లో రాఫెల్, మిగ్-29, మిరాజ్ 2000 ఉన్నాయి
- అందుబాటులోకి రాత్రి వేళ్లల్లో ల్యాండ్ చేసేలా యుద్ధ విమానాలు

## రెండు నెలలు ఆహారం నిల్వ చేసుకోండి

- పౌరులను కోరిన పీఓకే
- లోకల్ అసెంబ్లీని ఉద్దేశించి పీఓకే ప్రధానమంత్రి చౌదరి అన్వర్ అల్ హక్
- ఎల్‌ఓసీ వెంబడి 13 నియోజకవర్గాల్లో రెండు నెలల పాటు ఆహార పదార్థాలు నిల్వ చేసుకోవాలి



# కమ్ముకున్న యుద్ధ మేఘాలు..

**లక్నో:** పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో పాకిస్తాన్‌కు కేవలం వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తరప్రదేశ్ గంగా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఫైటర్ జెట్‌లు విన్యాసాలు చేయడం చర్చాంశనీయంగా మారింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలు చేస్తున్నయుద్ధ విమానాల్లో రాఫెల్, మిగ్-29, మిరాజ్ 2000 ఉన్నాయి. ఈ యుద్ధ విమానాల్ని రాత్రి వేళ్లల్లో ల్యాండ్ చేసేలా అందుబాటులోకి తెచ్చిన యూపీ షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై నిర్మించిన నైట్ ల్యాండింగ్ స్ట్రిప్‌పై విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. 3.5 కిలోమీటర్ల పొడవు గల ఈ ఎయిర్‌స్ట్రిప్ రాత్రి సమయంలో ఫైటర్ జెట్‌లు ల్యాండింగ్‌లకు అనుకూలంగా ఉంటుంది. ఇది ఎయిర్ ఫోర్స్ జెట్లు 24 గంటలూ ఆపరేషన్లకు వీలు కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్‌వేను ప్రత్యామ్నాయ రన్‌వేగా ఉపయోగించగల సామర్థ్యాన్ని అంచనా వేయడంలో సహాయపడుతుంది. దీంతో, ఉత్తరప్రదేశ్‌లో మొత్తం నాలుగు ఎక్స్‌ప్రెస్‌వే ల్యాండింగ్ స్ట్రిప్‌లు అందుబాటులో ఉండగా.. షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై ల్యాండింగ్ స్ట్రిప్ మాత్రమే రాత్రివేళల్లో ఫైటర్ జెట్‌లను ల్యాండ్ చేసుకోవచ్చు. ఈ ఆధునిక ఎయిర్‌స్ట్రిప్ ఎక్స్‌ప్రెస్‌వేపై నిర్మించబడిన భారత్‌లో తొలి రన్‌వేగా నిలిచింది. ఇది రాత్రింబవళ్ళూ మిలిటరీ ఆపరేషన్లకు అనుకూలంగా రూపొందించింది. భద్రతను నిర్ధారించేందుకు రన్‌వే ఇరుప్రక్కల 250 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఎయిర్‌స్ట్రిప్‌పై ల్యాండింగ్ చేసే ఇండియన్ ఎయిర్స్ యుద్ధ విమానాల ప్రత్యేకతలు

రాఫెల్: ఆధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, లాంగ్-రేంజ్ మీటియర్ క్షిపణులతో నిండి ఉంది. పరిస్థితులు ఎలా ఉన్నా సరే 100 కిలో మీటర్ల నుంచి 150 కిలోమీటర్ల శత్రు స్థావరాల్ని నేలమట్టం చేయడంలో దిట్ట

ఎస్‌యు-30 ఎంకేఐ: ఇండియా-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ట్విన్-సీటర్ యుద్ధవిమానం. ఈ ఎస్‌యూ-30 ఎంకేఐ దూరంలో ఉన్న లక్ష్యాల్ని దాడులు చేయగలిగే సామర్థ్యంతో పాటు బ్రహ్మోస్ వంటి క్షిపణులను మోసుకెళ్లగలదు.

మిరాజ్ 2000: ఫ్రెంచ్ మూలాలున్న, హై-స్పీడ్ డీప్ స్ట్రైక్ మిషన్స్‌కు అనువైన యుద్ధవిమానం, ఇది అణ్వాయుధ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫిబ్రవరి 2019లో జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు భారత వైమానిక దళానికి చెందిన 12 మిరాజ్-2000 యుద్ధ విమానాలను వినియోగించింది.

మిగ్-29: వేగం, ఎత్తు పరంగా అత్యుత్తమ ప్రదర్శనతో పాటు రాడార్‌ల కళ్లుగప్పి శత్రు స్థావరాల్ని నాశనం చేస్తుంది.

ఉత్తర ప్రదేశ్ లోని సహారన్‌పూర్ వద్ద యుద్ధ విమానాల విన్యాసాలు

జాగ్వార్: గ్రౌండ్ అటాక్, యాంటీ-షిప్ మిషన్ల కోసం రూపొందించబడిన ప్రిసిషన్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్. దీని ప్రత్యేకతలు.. శత్రు నౌకలను గుర్తించడం, లక్ష్యంగా చేసుకోవడం, నాశనం చేస్తుంది. ఈ యాంటీ-షిప్ మిషన్లు సాధారణంగా విమానాలు, జలాంతర్గాములు, ఉపరితల నౌకలు లేదా నావికా ముప్పు నుంచి తప్పించుకునేందుకు ఉపయోగిస్తారు.

సి-130 జె సూపర్ హెర్కులిస్: హెవీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, స్పెషల్ ఫోర్స్ మిషన్లు, విపత్తు సహాయం, రక్షణ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తుంది.

ఏఎన్-32: ఎత్తైన ప్రాంతాల్లో సైనికులు, సరఫరాలు తరలించేందుకు అనుకూలమైన ట్రాన్స్‌పోర్ట్ విమానం.

ఎంఐ-17 వి5 హెలికాప్టర్: సెర్చ్ అండ్ రెస్క్యూ, మెడికల్ ఎవాక్యుయేషన్, మానవతా సహాయం వంటి బహుళ పనుల కోసం ఉపయోగించే హెలికాప్టర్.

# సోనియా, రాహుల్‌కు కోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన కేసులో వీరిద్దరికీ కోర్టు ఈ నోటీసులు పంపింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుకు రిప్లై ఇవ్వాలని వారిద్దరికి కోర్టు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ మే 7వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఈడీ ఇటీవల దాఖలు చేసిన ఛార్జిషీట్ విచారణ సమయంలో ప్రతివాదుల వాదనలు వింటామని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే స్పష్టం చేశారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. ఈ నేపథ్యంలో విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి జూన్ 2014లో దాఖలు చేసిన ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు స్వీకరించింది. ఆ తర్వాత ఈ కేసులో 2021లో ఈడీ దర్యాప్తు అధికారికంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే.



# శశి థరూర్ నా పక్కన ఉన్నారు.. వారికి నిద్రలేని రాత్రులే

**తిరువనంతపురం:** కేరళ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విజింజం అంతర్జాతీయ ఓడరేవును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఓడరేవును ఆయన జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. “ఇవాళ శశి థరూర్ ఇక్కడ కూర్చున్నారు. ఈ వేదికపై ఆయన ఉండటం కొందరికి నచ్చదు. కొందరికి ఇది నిద్రలేని రాత్రులను మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి చేరుకుంటుంది” అంటూ మోదీ చురకలు అంటించారు. కేరళ సీఎం విజయన్ సమక్షంలోనే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని.. శశి థరూర్ స్వయంగా వెళ్లి స్వాగతించిన సంగతి తెలిసిందే. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారాయి. “ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా.. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించా” అంటూ శశి థరూర్ ట్వీట్ కూడా చేశారు. శశిథరూర్ గత కొన్ని నెలలుగా తన సొంత పార్టీపై అసంతృప్తిగా ఉన్న తెలిసిందే. ఇటీవల ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ కూడా ఆయన ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంతో



ఇవాళ ఆయన ప్రధాని మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, భారత సముద్ర వాణిజ్య చరిత్రలో కొత్త చరిత్రను లిఖించిన విజింజం అంతర్జాతీయ ఓడరేవు.. సముద్ర రవాణాకు కీలకమైన కేంద్రంగా మారనుంది. దేశంలో మొట్టమొదటి సెమీ ఆటోమేటెడ్ ఓడరేవు అయిన విజింజం ఓడరేవు ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాంకేతికంగా అధునాతనమైన ట్రాన్స్‌షిప్‌మెంట్ ఓడరేవులలో ఒకటిగా నిలిచింది.

# ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల ల్యాండింగ్, టేకాఫ్ డ్రిల్

షాజహాన్‌పూర్: భారత వాయిసేన యుద్ధ విమానాలు అత్యవసర పరిస్థితుల్లో ల్యాండింగ్, టేకాఫ్ తీసుకునేందుకు అవసరమైన డ్రిల్స్ శుక్రవారంనాడిక్కడ ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌పై ఉన్న దాదాపు 3.5 కిలోమీటర్ల స్ట్రిప్‌పై ఈ డ్రిల్స్ చేపట్టారు. దేశ రక్షణ సన్నద్ధతల్లో భాగంగా ఇదొక మైలురాయిగా చెప్పవచ్చు. యుద్ధవిమానాలు పగటి వేళలలోనే కాకుండా, రాత్రి వేళ్లల్లోనూ ఇక్కడ దిగేందుకు వీలుగా షాజహాన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించారు. ఇంతవరకూ, ఇదేతరహా అత్యవసర ల్యాండింగ్ డ్రిల్స్‌ను లక్నో-ఆగ్రా, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేల లో నిర్వహించారు. అయితే పగటి వేళల్లోనే ఈ ఆపరేషన్లు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ షజహాన్‌పూర్ లోని గంగాపూర్ ఎక్స్‌ప్రెస్‌వేపే వాయిసేన యుద్ధవిమానాల డ్రిల్స్ చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా-లక్నో, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ తర్వాత యుద్ధ విమానాలు దిగేలా నిర్మించిన నాలుగో ఎక్స్‌ప్రెస్‌వే షాజహాన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వే కావడం విశేషం. రాఫెల్, ఎస్‌యూ-30 ఎంకేఐ, మిరేజ్ 2000, మిగ్-29, జాగ్వార్, సి-130జే సూపర్ హెర్క్యులెస్, ఏఎన్-32, ఎఐ-17 %ఎ%5 హెలికాప్టర్ తదిరర ఐఏఏ విమానాలు ఈ డ్రిల్స్‌లో పాల్గొంటున్నాయి



## పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ బ్యాన్

జమ్మూ - కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను బలిగొన్న ఘోరమైన ఉగ్రవాద దాడిపై కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాకిస్తాన్ ప్రధాన మంత్రి ‘షెహబాజ్ షరీఫ్’ యూట్యూబ్ ఛానెల్‌ను శుక్రవారం భారతదేశంలో బ్లాక్ చేశారు. కొన్ని రోజుల క్రితం భారత ప్రభుత్వం 16 పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించిన తర్వాత ఈ ఖాతాలను బ్లాక్ చేశారు. వీటిలో డాన్ న్యూస్, సమా టీవీ, ఏఆర్‌వై న్యూస్ వంటి ప్రముఖ మీడియా సంస్థలు ఉన్నాయి. రెచ్చగొట్టే.. మతపరంగా సున్నితమైన కంటెంట్, తప్పుదారి పట్టించే కథనాలు మాత్రమే కాకుండా భారతదేశానికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారం ప్రసారం చేసినందుకు ఈ ఛానెల్‌లను నిషేధించారు. ‘షెహబాజ్ షరీఫ్’ యూట్యూబ్ ఛానెల్‌ను బ్లాక్ చేయడంతో పాటు.. గాయకుడు అతిఫ్ అస్లాం, క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, బాబర్ ఆజం, నటుడు ఫవాద్ ఖాన్, హనియా అమీర్, మహిరా ఖాన్‌లతో సహా అనేక మంది పాకిస్తాన్ ప్రముఖుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు కూడా సస్పెండ్ చేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగిన తరువాత.. భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం మాత్రమే కాకుండా, అటారీ-వాఘా సరిహద్దును కూడా పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్ గగనం తలంలో పాక్ విమాన ప్రయాణాలపై నిషేధం విధించింది.



## సిక్కు ఆర్మీ సైనికులకు రెచ్చగొట్టేలా..

**న్యూఢిల్లీ:** ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి వివాదస్పద వీడియో సందేశం ఇచ్చాడు. భారత సైన్యంలోని సిక్కు జవాన్లను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేస్తే సిక్కు సైనికులు పోరాడవద్దని విజ్ఞప్తి చేశాడు. సిక్కులకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ ‘స్నేహపూర్వక’ దేశమని పేర్కొన్నాడు. ‘భారతదేశం పాకిస్థాన్‌పై దాడి చేస్తే, అది భారతదేశానికి, ప్రధాని మోదీకి చివరి యుద్ధం అవుతుంది. భారతదేశం వైపు ఉన్న పంజాబీలు పాకిస్థాన్ సైన్యానికి లంగర్‌గా పనిచేస్తారు’ అని ఆ వీడియోలో అన్నాడు. కాగా, సిక్కు సైనికులకు పాకిస్థాన్ శత్రువు కాదని పన్నూన్ తెలిపాడు. పంజాబ్‌ను విముక్తి చేసిన తర్వాత పొరుగుదేశం అవుతుందని చెప్పాడు. ‘ఇప్పుడు నరేంద్ర మోదీ యుద్ధానికి నో చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. పాకిస్థాన్‌తో పోరాడకండి. పాకిస్థాన్ మీ శత్రువు కాదు. సిక్కు ప్రజలకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ స్నేహపూర్వక దేశంగా ఉంటుంది. మనం పంజాబ్‌ను విముక్తి చేసిన తర్వాత, పాకిస్థాన్ మన పొరుగు దేశం అవుతుంది’ అని అన్నాడు. పహల్గామ్‌లో హిందువుల ఊచకోత వెనుక మోదీ ప్రభుత్వం ఉందని పన్నూన్ ఆరోపించాడు.




## ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం




ఢిల్లీ : దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుందన్నారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ప్రపంచానికి కూడా ఇదే సందేశం ఇచ్చామన్నారాయన. ఈరోజు(శుక్రవారం) జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. ‘ పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన వ్యూహం కనిపించలేదు. రాహుల్ గాంధీ కాన్పూర్ లో చనిపోయిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలిశారు. చనిపోయిన వారికి ‘అమరుల’ హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుంది. ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం. మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించింది. ఇది రాహుల్ గాంధీ దీర్ఘకాలిక ఉద్యమ ఫలితమే. ఆయన “భారత్ జోడో న్యాయ యాత్ర” ద్వారా దీనిని ప్రధాన అజెండాగా మార్చారు. తెలంగాణ, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటికే కుల సర్వే పూర్తి చేశాయి. 50% రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలి. గణన నుండి వచ్చిన సమాచారాన్ని ప్రభుత్వం మంచి పాలన కోసం ఉపయోగించాలి.కులగణన కచ్చితంగా జరగాలి. ఫలితాలను అమలు చేయాలి. పాలసీలు, చట్టాలు దానికి అనుగుణంగా ఉండాలి. 2021 సాధారణ జనగణన కూడా జరగలేదు. ఇప్పటికీ 2011 డేటానే ఉపయోగిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ యొక్క రిజర్వేషన్ వ్యతిరేక దృక్పథమే ఈ ఆలస్యం వెనుక కారణం’ అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## రెండు నెలలు ఆహారం నిల్వ చేసుకోండి



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఇండియా-పాక్ మధ్య ఉద్రికతలు పెరుగుతున్న నేపథ్యంలో ముందుజాగ్రత్తగా ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవాల్సిందిగా పౌరులను పాక్ ఆక్రమిత కశ్మీర్ కోరినట్టు మీడియా వర్గాలు తెలిపాయి. లోకల్ అసెంబ్లీని ఉద్దేశించి పీఓకే ప్రధానమంత్రి చౌదరి అన్వర్ అల్ హక్ ప్రసంగిస్తూ, ఎల్ఓసీ వెంబడి 13 నియోజకవర్గాల్లో రెండు నెలల పాటు ఆహార పదార్థాలు నిల్వ చేసుకోవాలని పీఓకేలోని ప్రజలకు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఆహార పదార్థాలు, మెడిసన్లు, ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రూ.100 కోట్ల అత్వసర నిధిని పీఓకే ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు హక్‌ను ఉటంకిస్తూ అరబ్ న్యూస్ ఒక కథనంలో పేర్కొంది. కాగా, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ బుధవారంనాడు గిల్గిట్, స్కర్దు సహా పీఓకేలోని ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని విమానాలను భద్రతా కారణాల రీత్యా రద్దు చేసినట్టు మీడియా కథనాలు వెలువడ్డాయి. కరాచీ, లాహోర్ నుంచి స్కర్దుకు వెళ్లే రెండు విమానాలు, ఇస్లామాబాద్ నుంచి స్కర్దు వెళ్లే రెండు విమానాలు, ఇస్లామాబాద్ నుంచి గిల్గిట్ వెళ్లే నాలుగు విమానాలు రద్దయినట్టు ఉర్దూ డెయిలీ జంగ్ తెలిపింది.

# అమరావతికి సహకరిస్తాం..

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు.. "టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది" అన్నారు.

### పవన్ జీ.. ఇది మనమే చేయాలి..

"ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు




చెబుతున్నా" అన్నారు. "ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుంది" అని చెప్పారు.

### కనెక్టివిటీకి కొత్త అధ్యాయం..

"ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జులు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం" "వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి. ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీమాల్ అభివృద్ధి చేస్తున్నాం"

### విశాఖలో యోగా డేకు హాజరవుతా

"విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పనిచేస్తాను. అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ప్రధాని తెలిపారు.

# అమరావతి.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్

**అమరావతి:** ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు ఏకంగా 34వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారంటే.. దేశానికే కాదు.. ప్రపంచానికే ఇదో చరిత్ర అన్నారు. అలాంటి అమరావతి నగర నిర్మాణం తలపెడితే.. గత ఐదేళ్లలో ఎలాంటి విధ్వంసం జరిగిందో చూశామన్నారు.

### మోదీజీ.. ఉగ్రవాదంపై పోరులో మీకు అండగా ఉంటాం

అమరావతి పునఃప్రారంభోత్సవ సభలో సీఎం మాట్లాడుతూ.. "ఇవాళ.. ఏపీ చరిత్రలో శాశ్వతంగా లిఖించదగిన రోజు. గతంలో మోదీయే అమరావతి పనులకు శంకుస్థాపన చేశారు. గత ఐదేళ్లు రాజధాని నిర్మాణ పనులు ఆగిపోయాయి. మళ్లీ మోదీ చేతుల మీదుగానే పునఃప్రారంభమవుతున్నాయి. గతంలో మోదీని ఎప్పుడు కలిసినా చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. ఇటీవల కలిసినప్పుడు చాలా గంభీరంగా ఉన్నారు. పహల్గాంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న బాధలో ఆయన ఉన్నారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్రం తీసుకునే ప్రతి చర్యకూ అండగా ఉంటాం. మోదీకి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. మోదీజీ.. మేమంతా మీకు అండగా ఉన్నాం. వందేమాతరం.. భారత్ మాతాకీ జై అంటూ



చంద్రబాబు నినాదాలు చేశారు. ప్రజలతోనూ సీఎం నినాదాలు చేయించారు.

### కులగణనపై మోదీ నిర్ణయం గొప్పది

"సరైన సమయంలో.. సరైన నేత దేశాన్ని పాలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగింది. త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది. ఒకవైపు అభివృద్ధి మరోవైపు పేదరిక నిర్మూలనకు మోదీ కృషి చేస్తున్నారు. కులగణన చేయాలని ఇటీవల మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇదో గొప్ప నిర్ణయం" అని ప్రశంసించారు.

### వెంటిలేటర్ పైనుంచి బయటకు వచ్చాం..

"2024 ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. మోదీపై నమ్మకం, తెదేపా, జనసేన కలిసి పనిచేస్తే రాష్ట్రం మొత్తం తిరగబడింది. 93శాతం హిట్‌రేట్ వచ్చింది. మేం అధికారంలోకి వచ్చేసరికి ఆర్థిక వ్యవస్థ అగమ్య గోచరం. ఏం చేయాలో తెలియని పరిస్థితి. నేను నాలుగోసారి సీఎం.. కానీ, ఎటు చూసినా అగాథమే. అలాంటి సమయంలో వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్రం, వ్యక్తిగతంగా ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్నాం. వెంటిలేటర్ నుంచి బయటకు వచ్చాం.. ఇంకా కొన్నిరోజుల పాటు సహకారం వస్తే ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని రూపకల్పన చేస్తామని హామీ ఇస్తున్నా" అన్నారు.

### ఉద్యమకారులకు నా సెల్యూట్

అమరావతి కోసం రైతులు వీరోచితంగా పోరాడారు. మీ పోరాటం వల్లే అమరావతి పునః ప్రారంభమైంది. ఇది మీ అందరి విజయం. బాధలు, అవమానాలు, లాఠీ దెబ్బలు తిన్నారు, జైళ్లకు వెళ్లారు. అయినా వెనకడుగు వేయలేదు.. హ్యాట్సాఫ్. ఇలాంటి ఉద్యమాన్ని నా చరిత్రలో ఎన్నడూ చూడలేదు. మళ్లీ చూస్తానని కూడా నమ్మకంలేదు. అలాంటి ఉద్యమం చేసిన ఉద్యమకారులందరికీ సెల్యూట్ చేస్తున్నా. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా ఇచ్చిన ప్రజాతీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. పది నెలల్లో సవాళ్లను అధిగమించి కేంద్రం సహకారం, మోదీ ఆశీస్సులతో అమరావతి నిర్మాణాన్ని పట్టాలెక్కించాం. ఐదు కోట్ల మంది ప్రజలు నా రాజధాని అమరావతి అని చెప్పుకొనేలా నిర్మిస్తాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు

-మొదటిపేజీ తరువాయి

పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేసిన సూచనలు..నేడు జిల్లా అధ్యక్షులు సమావేశంలో ఇస్తున్న దిశానిర్దేశం రెండింటిని పరిశీలిస్తే..పార్టీని నాయకులకే అప్పగిస్తున్నారన్న టాక్ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది.జగన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో..పార్టీకి జిల్లా అధ్యక్షులే సర్వస్వం అన్నారట. మీరే పార్టీ..పార్టీనే మీరు అని క్లారిటీగా చెప్పేశారు. మీరే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని..ఎవరి కోసమో చూడొద్దని సూచించారు. మీకు ఎవరైనా ఆదేశిస్తారేమో అని ఎదురుచూడకుండా సొంత నిర్ణయాలు తీసుకోండి అని జగన్ ఫుల్ ఫ్రీడం ఇచ్చారట. జిల్లా పార్టీకి మీరే యజమానులు..మీ మాటే చెల్లుబాటు అవుతుంది.మీరే మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ తో కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ పరిధిలో రెండు వర్గాలు ఉంటే వారిని కో ఆర్డినేట్ చేసి సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారని సమాచారం. అంతేకాదు బాగా పనిచేయని ఇంచార్జిల విషయంలో కూడా ఒకటికి పదిసార్లు పరిశీలన చేసి..ఆ తర్వాత వారు దారికి రాకపోతే మార్చేసే విషయంలోనూ మీదే కీలకపాత్ర అన్నారు.జగన్ ఇంతలా వారి మీదనే ఎందుకు బాధ్యతలు మోపుతున్నారన్న చర్చ పార్టీ నేతల్లో మొదలైందట. పీఏసీ సభ్యులకూ ఇదే విధంగా సూచించారట. అలాగే జిల్లా అధ్యక్షుల విషయంలో ఈ విధంగానే చెబుతున్నారు. దీంతో జగన్ అధికారాలను వికేంద్రీకరించి పార్టీని గ్రాస్ రూట్ లెవెల్ దాకా తీసుకెళ్ళాలని అనుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. పార్టీ అధినేత జగన్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ




నేతలు చెప్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది.ఒకవైపు వైసీపీ ముఖ్య నేతలు వరుసగా అరెస్ట్ అవుతున్నారు. పైనున్న పెద్దలు దాకా కూడా ఈ అరెస్టులు రావచ్చు అన్న చర్చ సైతం పార్టీలో సాగుతోందట. అందుకే జగన్ అన్నీ చూసుకునే పార్టీని సమిష్టిగా నాయకులు అంతా కలసి నడిపే విధంగా ఈ కొత్త రకమైన రూపుని పార్టీకి అందిస్తున్నారని అంటున్నారు. ఏవైనా అనుకోని అవాంతరాలు ఏర్పడినా ఇబ్బందులు లేకుండా పార్టీ ముందుకు సాగాలని జగన్ ఆలోచిస్తున్నారని అంటున్నారు. పార్టీలో గత పరిస్థితులు ఇపుడు లేవని..అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే గుసగుసలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తట్టుకుని నిలబడేలా క్యాడర్ బేస్డ్ గా లీడర్ ఓరియేంటెడ్ గా పార్టీని తీర్చిదిద్దాలని జగన్ చూస్తున్నారని టాక్. మరి ఈ కొత్త రకమైన విధానం సక్సెస్ అయితే ఓకే గానీ, చిక్కల్లా అందరికీ బాధ్యతలు ఇస్తే ఎవరు ఏంచేస్తారో అన్న సందేహం పార్టీ అధినేత జగన్ ను వెంటాడుతోందట. ఏది ఏమైనా వైసీపీ అధినాయకత్వం పార్టీని పటిష్టపరిచేందుకు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది

## భారతదేశానికి తలమానికం అమరావతి



కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కారాలు తెలియచేశారు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. ప్రధాని మోదీకి ఆ కనకదుర్గమ్మ మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు ప్రసాదించాలని పవన్ దేవతామూర్తిని ప్రార్థించారు. అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు. గత ఐదేళ్లలో పడిన గాయాలు మనందరికీ గుర్తున్నాయి. ఎన్నో అవమానాలు, గాయాలు అమరావతి రైతులు అనుభవించారని పవన్ అన్నారు. "గత ఐదేళ్లు అమరావతి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. అమరావతి రైతులు మరిచిపోలేని పోరాటం చేశారు. అమరావతే ఏపీ రాజధానిగా ఉంటుందని ఆనాడు మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి మళ్లీ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచిపెట్టేసింది. అయితే, ధర్మయుద్ధంలో అమరావతి రైతులు విజయం సాధించారు" అని పవన్ అన్నారు. అమరావతి రైతుల త్యాగాలు మరిచిపోలేనివని చెప్పిన పవన్.. ఉద్యమంలో అమరావతి మహిళా రైతుల పాత్ర కీలకమన్నారు. అమరావతి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని చెప్పిన పవన్... రాజధాని రైతుల త్యాగాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కల్యాణ్ కొనియాడారు. రాళ్లు, రప్పల్లో మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అని పవన్ చెప్పారు. సైబరాబాద్‌ను చంద్రబాబు ఎలా సృష్టించారో.. అమరావతిని కూడా అలాగే అభివృద్ధి చేస్తారని పవన్ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రదాడి అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో కూడా.. ప్రధాని మోదీ మన కోసం అమరావతికి వచ్చారని పవన్ గుర్తు చేశారు. ఏపీపై మోదీ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పవన్ స్పష్టం చేశారు.

## నరేంద్ర మోదీ ఓ మిస్సైల్

-మొదటిపేజీ తరువాయి

వంద పాకిస్తాన్‌లకు సమాధానం చెప్పగలిగే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉందని, ఆ మిస్సైల్ నరేంద్ర మోదీ అని కొనియాడారు. సింహం ముందర ఆటలు ఆడకూడదు.. ఆడితే మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్‌లోనే పాకిస్తాన్ మిస్సింగ్ కావడం ఖాయమన్నారు. పాకిస్తాన్ ఆర్మీలో పని చేసే వారు కొంతమంది రాజీనామాలు చేశారని, మరికొంతమంది సెలవులో వెళ్లిపోయారని చెప్పారు. అది నరేంద్ర మోదీ పవర్ అంటూ కొనియాడారు. ప్రపంచం మొత్తం ప్రధాని మోదీకి మద్దతు ఇస్తోందన్నారు. కేంద్రం కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందని.. ఇది నిర్ణయం కాదని, ఇది ఒక సంచలనమని మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ అన్నా... అమరావతి అన్నా ఎంతో ప్రేమ అని అన్నారు. అందుకే ప్రధాని ఢిల్లీలో ఎంతో బిజీగా ఉన్నా కూడా కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని 94 సీట్లతో ప్రజలు గెలిపించారని, అందుకే ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ కోరిన అన్ని కోరికలనూ తీరుస్తున్నారని చెప్పారు. ఇటీవలే విశాఖపట్నంలో రైల్వే జోన్, ఎన్‌టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌కు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అలాగే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కూడా కాపాడారని తెలిపారు. ఇప్పుడు అమరావతికి వచ్చి నిధులే కాకుండా.. పనులు కూడా ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. వైసీపీ పాలనలో వ్యక్తిగత కక్షతో అమరావతిని చంపేయాలని చూశారని మంత్రి నారా లోకేష్ అన్నారు. వైసీపీ పాలనలో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. జై అమరావతి అన్నందుకు గతంలో బయట తిరగలేని పరిస్థితి ఉండేదని చెప్పారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు ఆపలేదని నారా లోకేష్ పేర్కొన్నారు.

## రాజ్ కెసిరెడ్డిని కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు

-మొదటిపేజీ తరువాయి

ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఆయన్ను శుక్రవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకూ సిట్ కస్టడీకి అప్పగించింది. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విచారించాలని పేర్కొంది. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి కెసిరెడ్డి ప్రతినెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి, ఆ సొమ్మంతా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చేర్చేవారని సిట్ దర్యాప్తులో గుర్తించింది.

## ముగిసిన త్రీమెన్ కమిటీ ప్రాథమిక విచారణ

విశాఖ :సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన దుర్ఘటనలో త్రీమెన్ కమిటీ ప్రాథమిక విచారణ ముగిసింది. దీనిపై ప్రభుత్వానికి రేపు(శనివారం) నివేదిక ఇవ్వనుంది త్రీమెన్ కమిటీ. దీనివలో భాగంగా త్రీమెన్ కమిటీ చైర్మన్, మున్సిపల్




పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ ' సింహాచలం దుర్ఘటనపై రేపు ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. ప?ప్రమాదానికి కారణమైన గోడను నోటి మాటతో కట్టేశారు. గోడ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు. విచారణలో భాగంగా వివిధ శాఖల వారిని విచారించాం. వైదిక నియమాలను ఉల్లంఘించినట్లు ఆలయ అర్చకులు చెప్పారు. ఆగమ శాస్త్రపరమైన సలహాలు లేకుండానే గోడ నిర్మించారని వైదికులు మా దృష్టికి తీసుకొచ్చారు. మాస్టర్ ప్లాన్ ఉల్లంఘనలు కనిపించాయి. ఎవరి అనుమతిలో మాస్టర్ ప్లాన్ పై నిర్ణయాలు తీసుకున్నారో తేలాలి. ప్రసాద్ స్కీం పనులు గత ఏడాది ఆగస్టులో పూర్తి కావాల్సి ఉంది. ఆలస్యానికి కారణం ఏంటని అడిగితే భిన్నమైన సమాధానాలు వచ్చాయి. అధికారుల మధ్య సమన్వయంపై ఉ?న్నతాధికారులతో మాట్లాడాలి' అని స్పష్టం చేశారు. కాగా, సింహాచలం చందనోత్సవంలో గోడ కుప్పకూలి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. రూ.300 టికెట్ కౌంటర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఇటీవలే అక్కడ గోడ నిర్మించారు. గోడ నాసిరకంగా నిర్మించడం వలనే కూలిపోయిందని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 2-3 గంటల మధ్య రూ.300 క్యూ లైన్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతులను విశాఖపట్నం మధురవాడ సమీపంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన పిల్లా ఉమామహేశ్వరరావు (30), ఆయన భార్య శైలజ (26)గా అధికారులు గుర్తించారు. వీరితో పాటు పిల్లా శైలజ తల్లి వెంకటరత్నం, మేనత్త గుజ్జురి మహాలక్ష్మి కూడా ఈ ఘటనలో మృతిచెందారు.

# సంపాదకీయం

## కొత్త పుంతలుతొక్కుతున్న అబద్ధాలు

నీ స్నేహితులను చూస్తే నువ్వేలాంటి వాడివో తెలుస్తుందన్నది ఒక లోకోక్తి. అనేక దేశాల నేతలు డోనాల్డ్ ట్రంప్ తమ జిగినీ దోస్తు అని చెప్పుకోవటం, చెట్టపట్టాల్ వేసుకొని తిరగటం తెలిసిందే. ట్రంప్ దాదాపు ప్రతి రోజూ ఎక్కడో అక్కడ మీడియాతో మాట్లాడితే, నోరు విప్పేది లేదని మోడీ భీషణ ప్రతిజ్ఞ చేసినట్టు వ్యవహరిస్తారు! ట్రంప్ పచ్చి అబద్ధాల కోరు అని చైనా తాజాగా చెబుతోంది, ఒక్క చైనాయే కాదు, అమెరికా మీడియా సైతం గతంలోనూ ఇప్పుడూ అదే చెబుతోంది. రోజూ ఎన్ని అసత్యాలు, తప్పుడు సమాచారం చెబుతున్నదీ లెక్కలు తీయటం ఒక పనిగా మారింది. తాజా అబద్ధం ఏమిటంటే చైనా అధ్యక్షుడు తనతో మాట్లాడినట్లు ట్రంప్ చెప్పాడు. ఎప్పుడు అంటే అవన్నీ మీకెందుకు మూడు నాలుగు వారాల్లో పన్నుల మీద అమెరికా ఒప్పందం చేసుకుంటుంది అన్నాడు. పన్నుల నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు చైనా సంకేతం పంపింది, పూర్తి విజయం నాదే అని కూడా చెప్పుకున్నాడు. పన్నుల గురించి అమెరికాతో ఎలాంటి సంప్రదింపులు, చర్చలు జరగటం లేదని చైనా విదేశాంగ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు స్పష్టం చేశాయి. అమెరికా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించాయి. ఇక ట్రంప్ అసత్యాలు, వక్రీకరణల విషయానికి వస్తే రెండోసారి పదవీ స్వీకారం చేసిన రోజే 20 అబద్ధాలు చెప్పినట్లు మీడియా విశ్లేషించింది. తొలి నాలుగేళ్ల పదవీ కాలంలో 30,573 అబద్ధాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక వెల్లడించింది. తొలి వంద రోజుల్లోనే 492 అబద్ధాలు, 2020లో ఓటింగ్‌కు ముందు నవంబరు రెండవ తేదీన ఒక్క రోజే 503 అవాస్తవాలు చెప్పి ఓటర్లను ఆకట్టుకొనేందుకు చూసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. నిజంగా ఒక రాజకీయ నేత అలా మాట్లాడతారా అన్న అనుమానం ఉంటే ట్రంప్, అతగాడి స్నేహితులను చూడాల్సిందే. ట్రంప్ నోటి నుంచి సగటున రోజుకు 21 తప్పుడు సమాచారం లేదా అబద్ధాలు వెలువడినట్లు తేలింది. తొలి ఏడాదిలో రోజుకు సగటున ఆరు, రెండో ఏడాది 14, మూడో ఏడు 22, నాలుగో సంవత్సరం 39 చొప్పున, అంటే పదవీ కాలం ముగిసే వ్యవధి దగ్గరపడిన కొద్దీ అబద్ధాలు పెరిగాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం సంస్థ ఏకంగా ట్రంప్ అబద్ధాల సమాచార కేంద్రాన్నే ఏర్పాటు చేసింది. రెండోసారి తొలి రోజే రెండు ప్రసంగాలలో 20 అబద్ధాలతో ప్రారంభం అయిన తీరు చూస్తే నాలుగేళ్లలో గత రికార్డును బద్దలు కొట్టేందుకు ఎంతో కాలం పట్టదనిపిస్తోంది. ఒక ప్రధానిగా నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎవరికైనా అభినందనలు తెలపటం ఒక సంప్రదాయం, కానీ అబద్ధాల కోరు ట్రంప్‌ను నా స్నేహితుడు అంటూ మోడీ సందేశాలు పంపారు. వివిధ సందర్భాలలో వర్ణించారు కూడా. రాజకీయాల పుట్టుకతోనే అబద్ధాలు కూడా వెంట వచ్చాయిగానీ ఇటీవలి కాలంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎవరు అవునన్నా కాదన్నా వాటికి డోనాల్డ్ ట్రంప్, అతగాడి బాటలో నడిచే వారు నిష్ణాతులుగా మారారు. అతగాడిని చూసి ఉత్తేజం, ఉత్సాహం పొంది ప్రపంచంలో అనేక దేశాల అధ్యక్షులు లేదా ప్రధానులు కూడా సిగ్గూ ఎగ్గూ లేకుండా అవాస్తవాలు, అసత్యాలు, వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ నాయకుడంటే ఒపీనియన్స్ (అభిప్రాయాలు) మారుస్తూ ఉండాలని గురజాడ చురక అంటించారు. ఆయనే ఇప్పుడు బతికి ఉంటే అబద్ధాలు చెప్పని వాడు రాజకీయ నేత కానే కాదని గిరీశం చేత చెప్పించి ఉండేవారు. జర్నలిస్టులు వార్తలను సేకరించే పనిలో భాగంగా నేతల మాటల్లో అబద్ధాలు ఎన్ని ఉన్నాయో ఎత్తి చూపే పని భారం వారి మీద పడిందంటే అతిశయోక్తి కాదు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో కొన్ని సంస్థలు ప్రత్యేకంగా సిబ్బందినే నియమించాయి. ట్రంప్ రెండవసారి జనవరి 20న పదవిని చేపట్టి వందవ రోజు పూర్తి చేసుకొనేందుకు ముందుకు పోతున్నాడు. ఈ లోగానే మీడియాను అణచివేసేందుకు కూడా పూనుకున్నాడు. సరిహద్దులు లేని రిపోర్టర్లు అనే సంస్థ పత్రికా స్వేచ్ఛ మీద రాజ్యాంగేతర దాడి ఎలా జరుగుతున్నదో వివరించింది. ఆరోగ్యం, నేరాల వంటి సమాచారం తెలుసుకొనేందుకు వీలు కల్పించే ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్ల నుంచి ఎనిమిదివేల పేజీలను ప్రభుత్వం తొలగించింది. జనాలు, మీడియాకు సమాచారం అందకుండా చేయటం తప్ప ఇది మరొకటి కాదు. ప్రభుత్వం నిర్వహించే 180 రేడియో స్టేషన్లను మూసివేసేందుకు గాను వాటికి అందచేస్తున్న 110 కోట్ల డాలర్ల నిధులు నిలిపివేయాలని పార్లమెంట్‌ను కోరాడు. దీనివలన గ్రామీణ, సుదూర ప్రాంతాల వారికి వాటి సేవలు నిలిచిపోతాయి. ప్రభుత్వ రంగంలోని మీడియాకు ప్రతి ఏటా సగటున ఒక పౌరుడు చెల్లిస్తున్న మొత్తం కేవలం 1.6 డాలర్లు మాత్రమే. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి అధ్యక్ష భవన వార్తలను సేకరించకుండా అసోసియేటెడ్ ప్రెస్(ఏపి) సంస్థ విలేకర్లను నిషేధించారు. మెక్సికో గల్ఫ్ పేరును అమెరికా గల్ఫ్ అని మార్చినప్పటికీ ఆ సంస్థ తన వార్తలో పాత పేరునే వినియోగిస్తుండటమే దీనికి కారణం. ఏప్రిల్ 9న ఒక కోర్టు ఈ నిషేధం ఎత్తివేయాలని ఆదేశించినప్పటికీ ఖాతరు చేయటం లేదు. తన స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా 64 సార్లు మీడియా మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడు. 2021 జనవరి ఆరున కాపిటోల్ వద్ద జర్నలిస్టులపై దాడి చేసిన కేసులో శిక్షలు పడిన తన అనుచరులైన 13 మంది గూండాలను క్షమాభిక్ష పేరుతో విడుదల చేశాడు. మీడియా సంస్థలను వేధించేందుకు ఆరు కంపెనీలపై విచారణకు ఆదేశించాడు. ప్రాజెక్టు 2025 పేరుతో ట్రంప్ ఎజెండాకు రూపకల్పన చేసిన బ్రెండన్ కార్, మీడియా నియంత్రణ కమిషన్ చైర్మన్‌ను చేసిన తరువాత ట్రంప్ గురించి విమర్శనాత్మక వార్తలను అందించే సిబిఎస్, ఎబిసి, ఎన్‌బిసి, ఎన్‌పిఆర్, పిబిఎస్, కాలిఫోర్నియా టెలివిజన్‌లపై విచారణ పేరుతో వేధింపులకు పూనుకున్నాడు. నాలుగు సంస్థలపై ట్రంప్ వ్యక్తిగతంగా పరువునష్టం కేసులు వేశాడు. ఇక కమ్యూనిజానికి, తమను వ్యతిరేకించే దేశాల గురించి తప్పుడు ప్రచారం చేసేందుకు అమెరికా ప్రభుత్వం యుఎస్ ఏజన్సీ ఫర్ గ్లోబల్ మీడియా అనే సంస్థను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. తరువాత మీడియా పెద్ద ఎత్తున విస్తరించి అలాంటి ప్రచారం చేసేందుకు వాటితో పెద్దగా అవసరం లేకపోయింది. అందుకే అది నిర్వహించే రేడియో, టీవీ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. విలేకర్లను సెలవుపై వెళ్లాలని కోరారు. ఈ సంస్థ ద్వారా నిర్వహించే వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, యూరోప్ లిబర్టీ వంటి వాటిలో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య వ్యతిరేక వార్తలను ప్రచారం చేస్తున్నారు. అవి ఎంతగా రెచ్చగొట్టినా అమెరికా పాలక వర్గానికి వచ్చిన మేలేమీ లేకపోవటంతో ట్రంప్ వాటికి నిధులు నిలిపివేశాడు. ఈ చర్య వలన మూడున్నర వేల మందికి పైగా జర్నలిస్టులు, ఇతర సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. ఈ సంస్థలలో పని చేస్తూ తప్పుడు వార్తలను ప్రచారం చేసిన జర్నలిస్టులలో విదేశాలకు చెందిన 84 మందిని స్వదేశాలకు పంపాలని నిర్ణయించింది. అయితే వారిలో అనేక మందిని ఆయా దేశాలు కేసులు పెట్టి జైలు పాలు చేసే అవకాశం ఉందట. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసేందుకు వివిధ దేశాలలో ప్రైవేటు టీవీలు, పత్రికలకు, కొందరు జర్నలిస్టులకు సిఐఏ, ఇతర సంస్థల ద్వారా పెద్ద ఎత్తున నిధులు అందచేస్తున్న సంగతి తెలిసిందే

# కానరాని మీడియా స్వేచ్ఛ..




ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి. ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీనపత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలంలో ఉంది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాకపోవడం విచారకరం. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపు తున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం.

# బూదరాజు సేవలు చిరస్మరణీయం

తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. తెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణిక్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యయిఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది. బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సాగింది. భాషపై ఆసక్తితో "%ఎఱర్శీతీఱఝశ్రీ +తీఱఎఝతీ శీట ఝతీశ్రీఎ ఎవశ్రీబస్త్రబ ×అంఎతీఱజ్ఱశీఅం%" అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ , తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ధర్మం ముగిసి పోలేదుకావలసిన చోటా, అవసరమైన సమయంలో రచన ద్వారా ఆయన శబ్దజీవితమై మిగిలారు. పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థ లో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు. "పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి. తెలుగు భాషా శాస్త్ర పరిశోధనకు బూదరాజు కృషి విలువైనదిగా గుర్తించ బడింది. "వాస్తు పదకోశం", "వ్యవహార కోశం", "తెలుగు దినపత్రికల భాష" వంటి ప్రామాణిక రచనలు ఆయన మేధస్సుకు నిదర్శనాలు. నన్నయ పూర్వకాలపు శాసన భాషను అధ్యయనం చేసి, మాండలికాల వ్యాప్తిపై చేసిన విశ్లేషణ భాషా పరిశోధకులకు గొప్ప వనరుగా నిలిచింది. వ్యాకరణ నియమాలు, వినియోగ నిబంధనలు, భాషా అభివృద్ధిలో సమాజ పాత్ర వంటి అంశాలపై ఆయన వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవిగా భావించ బడుతున్నాయి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్ఠమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవ రాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు. అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను



తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు. జ్ఞానం, వినయం, మిత భాషణం, శ్రద్ధ అనే నాలుగు గుణాలతో ఆయన మానవీయత వెలిసింది. నుకల నారాయణ, కాళోజీ నారాయణరావు, న్యాపతి సుబ్బారావు వంటి ప్రముఖులతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన సమాజాభిముఖ దృక్పథానికి ప్రతీకలుగా నిలిచాయి. విశేషమైన విషయ పరిపక్వత, పదాలను నాణ్యంగా ఉపయోగించే నైపుణ్యం ఆయన రచనలకు స్ఫూర్తినిచ్చాయి. బూదరాజు రాధాకృష్ణ జీవితం తెలుగు భాషకు అంకితమై, పరిశోధనతో నిండి, శ్రద్ధతో నడిచిన ఆత్మసాక్షాత్కార యాత్ర. ఆయన రచనలు నేటికీ తెలుగు అధ్యాపకులకు, పాత్రికేయులకు, తర్జుమకారులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తిసజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలోఇప్పటికీ స్పందిస్తోంది.

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలి

**ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తుగా చేస్తున్న అడ్మిషన్స్ లను అరికట్టండి**

**ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి రోహిత్ శివమణి**



**గుంతకల్లు మే 2 (ప్రజా జ్యోతి):** ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని,ముందస్తుగా చేస్తున్న అడ్మిషన్స్ లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి రోహిత్,శివమణి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో రోహిత్,శివమణి మాట్లాడు. తూ గుంతకల్లు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారు, నూతన విద్యా సంవత్సరం 2025-2026 సంవత్సరానికి అడ్మిషన్ చేసుకుంటున్నారు. అదేవిధంగా కోర్సుల పేరిట వేలాది నుండి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు,పేద బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేస్తూ ఒక్కొక్క సంవత్సరానికి పుస్తకాల పేరిట స్కూల్ యూనిఫార్మ్ మరియు షూ, బెల్ట్ అని చెప్పేసి తల్లిదండ్రు లు మోసం చేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నా రు దీనిపైన విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థ లు ఎదుట శాంతియుతంగా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తా. మని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్, పట్టణ నాయకులు ముస్తఫా, జయరాం,భరత్,వీరేష్,వర ప్రసాద్,వెంకటేష్, కిరణ్,హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి




గుంతకల్లు మే 2 (ప్రజాజ్యోతి): పట్టణంలోని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ( అంతిమ యుద్ధం ) పేరుతో చత్తీస్ ఘడ్ లోని దండకారణ్యం లోను, తెలంగాణ సరిహద్దుల్లో కర్రెగుట్ట కొండలని లక్షల మంది పారా మిలటరీ దళాలు,సైన్యము చుట్టు ముట్టి జల్లెడబడుతూ మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు,ఆదివాసులను వందలాది మందిని బూటపు ఎన్కౌంటర్లతో హత్యలు చేయడం జరుగుతున్నది.ఈ మారణకాండను వ్యతిరేకిస్తూ ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి,కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ను నిర్వహిస్తున్న ప్రభుత్వం,పోలీస్ అధికారులు రాజ్యాంగ, చట్టబద్ధ నిబంధనలు, సాయిధ ఘర్షణలకు సంబంధించిన నియమాలు ఏమాత్రం పట్టించుకోకుండా మావోయిస్టు పార్టీ నాయకుల ను,కార్యకర్తలను,ఆదివాసుల ను భౌతికంగా నిర్మూలించడం జరుగుతున్నది.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నక్సలైట్ల సమస్యను ఆర్థిక సామాజిక రాజకీయ కోణంలో పరిశీలించకుండా శాంతిభద్ర తల సమస్యగా చూపెడుతూ కమ్యూనిస్టు విప్లవకారుల ఉద్యమం పైన తీవ్ర అణిచివేతను కొనసాగించడం జరుగుతున్నది.చత్తిస్ ఘడ్, దండకారణ్యం అడవుల్లో ఉన్న అపార ఖనిజ సంపద లక్షల కోట్ల రూపాయలు విలువైన సహజ వనరులను ఆదాని,అంబానీ,కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికే ఈ మారణకాండను కేంద్ర ప్రభుత్వం కొనసాగించుకు న్నది.ఈ హత్యాకాండను దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులు,వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో కాల్పుల విరమణను పాటించి శాంతి చర్చలు జరపాలని ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలని డిమాండ్ చేయడం జరుగుతున్నది.కేంద్ర ప్రభుత్వ చర్య పైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మాట్లాడడం జరిగినది.ఈ కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ కమిటీ సభ్యులు జిలాన్,రామాంజనేయులు,ఐ ఎఫ్ టి యు కమిటీ సభ్యులు షేక్షావలి,నారాయణ,భాష,గోపి,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయ భాస్కర్‌కి దాసరి సేవ రత్న అవార్డు అందజేసిన చలనచిత్ర ప్రముఖులు.



**యలమంచిలి మే 2 ప్రజాజ్యోతి న్యూస్ :** సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత గుమ్ములూరు ఉదయ భాస్కర రావు కి దాసరి సేవ రత్న అవార్డు అందుకున్నారు దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదు ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన దాసరి ఫిలిం అవార్డు సభలో సినీ నటులు మురళీమోహన్ హీరో సుమన్ సాయి కుమార్ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అందజేశారు ఎం తో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ కార్యక్రమంలో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాత దిల్ రాజ్ విజయేంద్ర ప్రసాద్ దర్శకులు రేలంగి నరసింహారావు అనిల్ రావిపూడి బి గోపాల్ హీరోయిన్ దివ్యవాణి కోర్టు చలనచిత్ర దర్శకులు నిర్మాతలు నటుడు దర్శకుడు ధనరాజ్ అవార్డు గ్రహీతలు హాజరైనారు ఈ కార్యక్రమానికి జర్నలిస్ట్ ప్రభు స్వాగతం పలికారు

**ఉదయ్ భాస్కర్ కి అభినందనలు తెలిపిన పాలకొల్లు వాసులు**

దాసరి అవార్డు గ్రహీత అయిన జర్నలిస్ట్ ఉదయ భాస్కర రావు కి మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ ప్రముఖ నటులు కాపినిస్తే కార్టూ నిస్ట్ తాడి బలరాం నటుడు సినీ దర్శకుడు ఆకుమర్తి బాబురావు ఈ సందర్భంగా మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ గాలి దేరి సత్యనారాయణ మాట్లాడుతూ రంగస్థలం నటుడు దర్శకుడు సీనియర్ జర్నలిస్ట్ అయిన ఉదయ భాస్కర్ కి దాసరి సేవ రత్న ఫిలిం అవార్డు రావటం పట్ల ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను అన్నారు.

# అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న గుమ్మాపు సూర్య వరప్రసాద్.




**పాలకొల్లు మే 2 ప్రజాజ్యోతి న్యూస్ :** లైబ్రెరి హాల్ విశాఖపట్నం నందు వరల్డ్ చారిటీ వెల్ఫర్ పండేషన్ వారి ఆధ్వర్యంలో డా.ఏ పి జే అబ్దుల్ కలాం ఇంట్రనేషనల్ అవార్డు పివి రావు మాల మహానాడు రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గుమ్మాపు సూర్య వరప్రసాద్ కి ఇవ్వటం జరిగింది. ఈ అవార్డును సోషల్ సర్వీస్ చేస్తున్న సందర్భంగా అందించారు. 2002 నుండి ఉద్యమాల్లో మరియు అనేక సోషల్ యాక్టివ్ కార్యక్రమాల్లో నిబద్ధతతో, కచ్చితంగా పనిచేస్తున్న సందర్భంగా ఈ అవార్డు అందించారు.అవార్డు తీసుకోవటంతో నా కుల బాధితులు పట్ల మరింత బాధ్యతగా అంకిత భావంతో పనిచేస్తానని.ఇలాగే 2018 లో ఉండి నియోజకవర్గం గరగపర్రు గ్రామంలో సుమారు 350 కుటుంబాలను, గుడివాడ నియోజకవర్గం దొండపాడు గ్రామంలో దళితులను విచక్షణా రహితంగా కొట్టి సుమారు 200 ల దళిత కుటుంబాలను సోషల్ బాయ్ కట్ చేస్తే ఆ సంఘటనపై అలుపెరగని పోరాటం చేసి ప్రభుత్వం ద్వారా వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసిన సందర్భంగా 2019 లో ఢిల్లీలో డా.బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఫెలో షిఫ్ అవార్డు ఇవ్వటం జరిగిందని ఈ సందర్భంగా నాకు తోడుగా ఉంటూ నాతో కలిసి ఉద్యంలో బాగస్వాములు అవుతున్న ప్రతి వక్కరికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నాని.పి.వి.రావు మామమహానాడు రాష్ట్ర అధ్యక్షులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏ పి రాష్ట్ర వైస్ చైర్మన్. గుమ్మాపు.సూర్య వరప్రసాద్ రావు.తెలియజేశారు.

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘనంగా శంకర జయంతి ఉత్సవం





**మే 2,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు జరిగిన శంకర జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రస్థానత్రయ భాష్య పారాయణం, శంకరుల పూజాభిషేకం నిర్వహించబడింది. విశ్వవిద్యాలయం కులపతి గుల్లపల్లి శ్రీరామకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని, జగద్గురు ఆదిశంకరుల పాదయాత్ర, ఆయన రచించిన స్తోత్రాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, తిరుమల క్షేత్రం ప్రాధాన్యతను వివరించడంతో పాటు, విద్యార్థులు అధికంగా వచ్చి విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. అకాడమిక్ డీన్ రజనీకాంత్ శుక్ల, శంకరులు స్థాపించిన చాతుర్మాయ పీఠాల గురించి, ఆయన రచించిన స్తోత్రాల విశిష్టతను వివరించారు. విత్తాధికారి రాధా గోవింద త్రిపాఠి, అద్వైత వేదాంత విభాగాధ్యక్షులు కే. గణపతి భట్, అద్వైత విభాగ్యులు కె. ఎస్. సతీష, నాగరాజ భట్, మనోజ్ షిండే అంగద్, శ్రీహరిధాయ్ గుడే తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఇతర విభాగాల అధ్యాపకులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదు రోజుల ప్రస్థానత్రయ భాష్య పారాయణంలో అద్వైత వేదాంత విద్యార్థులు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గోవింద భగవత్ పాదాచార్య వాక్యార్థంలో ప్రతిభ కనబరిచిన తేజ్ కుమార్‌కు "వాక్యార్థ చక్రవర్తి" బిరుదును ప్రదానం చేసి, విద్యార్థులను ప్రోత్సహించారు. చివరగా, కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ శంకరుల అనుగ్రహం కలగాలని కులపతివర్యులు ఆశీర్వదించారు.

## అకాల వర్షాల వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏఈఓ ఓబయ్య




**బద్వేల్ మే 2 (ప్రజా జ్యోతి న్యూస్)** గోపవరం మండలం రాచాయపేట గ్రామ పంచాయతీ నందు వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య విస్తృతంగా పర్యటించారు, అయితే అదృష్టావశత్తు ఈ వర్షం వల్ల ఎక్కడ రైతులు నష్టపోలేదన్నారు, ఇంకా ఈ విదంగా వర్షాలు పడితే పెసర, వేరుశనగ పంటలు నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు, కాబట్టి కయ్యల్లో నిల్వ ఉన్న నీళ్లు బయటికి వదలాలి, అలాగే వేరుశనగ వేసిన రైతులు ఈ సమయం లో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే కొంచం ఇబ్బందులు ఎదుర్కొంటారు అని వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య తెలియజేసారు, ఈ కార్యక్రమం లో ఎఫ్పిఓ సీసీ సుదర్శన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గరుడ వారధి పై ఆకతాయిల ఆట కట్





**మే 2,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి గరుడ వారధిపై భర్తడే పార్టీ, బైక్ రేసులు జరుగుతున్నాయని విశ్వసనీయమైన సమాచారం మేరకు గరుడ వారధిపై ఐదు సోలార్ సిసి కెమెరాలను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు సూచనలు మేరకు అమర్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇద్దరు యువతులు, ఒక యువకుడు గురడ వారిధిపై భర్తడే పార్టీ చేసుకుంటున్నది సోలార్ సిసి కెమెరా లో గమనించి కంట్రోల్ రూమ్ నుండి గరుడ వారిది పైన భర్తడే పార్టీ చేసుకుంటున్న యువతను సోలార్ సిసి కెమెరా నుండి వచ్చిన పోలీసు సైరన్ వేయడం లో పాటు పోలీస్ సిబ్బంది స్పాట్ కి చేరుకునే లోపల భర్తడే పార్టీ చేసుకుంటున్న వాళ్ళు సోలార్ సిసి కెమెరా లో నుండి వచ్చిన పోలీసు సైరన్ వీని అక్కడ నుండి బైక్ పై పారిపోయారు.వేంటనే మా పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ నేపథ్యంలో యువతి, యువకుకు ఎప్పుడూ గరుడ వారధి మీద పుట్టిన రోజు వేడుకలు చేసుకొవద్దు అని మనవి చేశారు.

# మహిళా పోలీసుల విధులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వెబ్ సైట్...

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.**

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** క్షేత్ర స్థాయిలో మహిళా పోలీసులు పని తీరును పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్సైట్ను, గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. మహిళా పోలీసులు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి వెబ్ సైట్ పనితీరును వివరించి, సందేహాలను నివృత్తి చేసిన జిల్లా ఎస్పీ. రాష్ట్రంలో ప్రప్రధమంగా మహిళా పోలీసుల కోసం ప్రత్యేక వెబ్ సైట్ జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ. విజయనగరం జిల్లాలో పని చేస్తున్న మహిళా పోలీసుల పని తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్రంలోనే ప్రప్రధమంగా ప్రత్యేకంగా మహిళా పోలీసు వెబ్ సైటు, గోడ పత్రికను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మే 2న జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం, మహిళా పోలీసులు, సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి, వెబ్సైట్ పనితీరును వివరించి, వెబ్సైట్ సులువుగా వినియోగించేందుకు మహిళా పోలీసుల సందేహాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నివృత్తి చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న మహిళా పోలీసులు నిర్వహించే విధులు చాలా కీలకమైనవని, క్షేత్ర స్థాయిలో వారి విధులను పర్యవేక్షించేందుకు, ఉత్తమంగా పని చేసిన మహిళా పోలీసులను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'మహిళా పోలీసు వెబ్ సైట్ ను ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రధమంగా మహిళా పోలీసుల కోసం వెబ్సైట్ను విజయనగరం జిల్లాలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వెబ్సైట్లో మహిళా పోలీసులు నిర్వహించే విధుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఏ మారుమూల ప్రాంతంలో మహిళా పోలీసులు పని చేసినా, వారి పనితీరును జిల్లా కేంద్రం నుండే వెబ్సైట్ ఆధారంగా పర్యవేక్షించే వెసులుబాటు ఉంటుందని జిల్లా ఎస్పీ అన్నారు. క్షేత్ర స్థాయిలో మహిళా పోలీసులు నిర్వహించే విధుల వివరాలను, సాధించిన లక్ష్యాలను వెబ్సైట్లో నమోదు చేసిన ఆధారంగా, వారి పని తీరును భేరీజు వేసి, ప్రోత్సహిస్తామన్నారు. ఇందుకుగాను మహిళా పోలీసులకు కొన్ని లక్ష్యాలను నిర్దేశించి, ఒక్కో తరహా విధి నిర్వహణకు, లక్ష్య సాధనలకు కొన్ని పాయింట్లును ఇవ్వడం జరిగిందన్నారు. మాసాంతరంలో వారు నిర్వర్తించిన విధులు, సాధించిన లక్ష్యాలు, పాయింట్లు ఆధారంగా మొదటి స్థానంలో నిలిచిన ఐదుగురిని జిల్లా కేంద్రానికి పిలిపించి, అభినందించి, ప్రోత్సహిస్తామన్నారు. మహిళా పోలీసులు క్షేత్ర స్థాయిలో నిర్వర్తించే విధుల్లో సిసి కెమెరాల ఏర్పాటు, అనుమానస్పద వ్యక్తులు, నేర చరిత కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా, అవగాహన సదస్సుల నిర్వహణ, మహిళలు, బాలల భద్రత, నేర నియంత్రణ, శక్తి యాప్ డౌన్లోడు, శక్తి ఎస్.ఓ.ఎస్. కాల్కు స్పందించడం,






దర్యాప్తులో అధికారులకు సహకరించడం, నేరస్థల సంరక్షణ, ఫ్యామిలీ కౌన్సిలింగు, బాల కార్మిక, బాల్య వివాహాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతలకు విఘాతం కలిగే అంశాలు క్షేత్రస్థాయిలో గుర్తించడం, వంటరి మహిళలు, వలస వ్యక్తుల సమాచార సేకరణ, అనుమానస్పద మరణాలు, రహదారి ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేస్తూ, వివరాలను వెబ్సైట్లో నమోదు చేయాల్సి ఉంటుందని మహిళా పోలీసులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే. చౌదరి, కమ్యూనికేషను ఇన్స్పెక్టరు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

# బెట్టింగులకు పాల్పడుతున్న ప్రధాన నిందితులతోసహా 11 మంది అరెస్టు..





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఆన్లైను బెట్టింగులకు పాల్పడుతున్న 11 మందిని అరెస్టు చేసిన బొబ్బిలి పోలీసులు. బెట్టింగు గ్యాంగు నుండి రూ.14.02 లక్షల నగదు, ఒక కారు, ల్యాప్ టాప్, 13మొబైల్స్ సీజ్ చేసినట్లుగా తెలిపిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని శివరాంపురం గ్రామ శివార్లలోని మామిడి తోటలో ఆన్లైను క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ప్రధాన నిందితులతో సహా 11మందిని అరెస్టు చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మే 2న వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని శివరాంపురం గ్రామ శివార్లలోగల మామిడితోటలో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, విచారణ చేయగా, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టయ్యిందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముసిడిపల్లి దివాకర్ (ఎ-1) క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతూ, బెట్టింగులతో నగదు సంపాందించాలనే లక్ష్యంతో బెంగుళూరుకు చెందిన నిరంజన్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుండి 'రాధే ఎక్ఛేంజ్' అనే బెట్టింగు యాప్ అడ్మిన్ తీసుకొని, యువతను ఆకర్షించేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో కమీషను ఇస్తూ ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క ఏజంటును నియమించుకొన్నారన్నారు.

ఏజంట్లుగా నియమించినబడిన వ్యక్తులందరూ బెట్టింగు యాప్ను ప్రమోట్ చేస్తూ, యువతను ఆకర్షిస్తూ, వాట్సాప్ ద్వారా లింకులను షేర్ చేస్తూ, ఒక పథకం ప్రకారం బెట్టింగులకు పాల్పడుతున్నారన్నారు. బెట్టింగులకు మరింత విస్తృతం చేయాలనే ఉద్ధేశ్యంతో ముసిడిపల్లి దివాకర్ (ఎ-1), పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుండాల నవీన్, ఈదుబిల్లి సంతోష్ లతో కలసి నేషనల్ ఎక్ఛేంజ్ అనే మరో బెట్టింగు యాప్ అడ్మిన్ ఐడిని తీసుకొన్నట్లుగా విచారణలో వెల్లడయ్యిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ యాప్లను సుమారు 200మంది యువకులు విజయనగరం, పార్వతీపురం మన్యం మరియు విశాఖపట్నం జిల్లాల్లో వినియోగిస్తూ, బెట్టింగులకు పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఈ బెట్టింగులకు పాల్పడుతున్న 11మందిని అరెస్టు చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. వారిలో ముసిడిపల్లి దివాకర్ (అడ్మిన్), అంబటి రాంమోహన్ (అడ్మిన్), మహంతి గణేష్ (ఏజంట్), సామిరెడ్డి వాసు (ఏజంట్) కొట్టంగి మోహనరావు (ఏజంట్), మోడద్ల పైడిరాజు (ఏజంట్), తాటి శంకరరావు (ఏజంట్), గేదెల శ్రీనివాస్ (యూజర్), సీరపు నారాయణరావు (యూజర్), తెర్లి మోహనరావు (యూజర్) ఉన్నారన్నారు. వీరి వద్ద నుండి రూ.14,02,000/-ల నగదు, లెనోవ ల్యాప్ టాప్, ఎపి 05 ఈవై 4567 నంబరు గల కారు, 13 మొబైల్ ఫోన్లను సీజ్ చేసామన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిరంజన్ రెడ్డి (అడ్మిన్), ఈదురపల్లి సంతోష్ (అడ్మిన్), కార్తీక్ (అడ్మిన్), నవీన్ (అడ్మిన్) కోసం గాలిస్తున్నామన్నారు. ప్రధాన నిందితుడు అయిన ముసిడిపల్లి దివాకర్ ఏజంట్లుకు 3శాతం కమీషను ఇవ్వడంతోపాటు, పోగొట్టుకున్న వ్యక్తుల నగదులో 50శాతం సొమ్మును ఏజంట్లుకు ఇచ్చి. వారిని బెట్టింగు యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించేవాడని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ లతో డబ్బులు సంపాదించడం సాధ్యం కాదని, యాప్ నిర్వాహకులు డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతోనే యాప్ లను తయారు చేసి, యువతను ఆకర్షిస్తారన్నారు. జీవితాలను నాశనం చేసే ఆన్లైన్ బెట్టింగుల జోలికి పోవద్దని ప్రజలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. ఆన్లైను క్రికెట్ బెట్టింగు ముఠాను గుట్టురట్టు చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, బొబ్బిలి ఎస్ఐ ఆర్.రమేష్, కానిస్టేబుళ్ళు ఎన్.సత్యన్నారాయణ, పి.సతీష్ కుమార్. కే. ఎర్రం నాయుడు, పి.అప్పారావులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, ఎస్పీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా డి సి సి ఉపాధ్యక్షుడిగా గడి బంగారు నాయుడు.



**శృంగవరపుకోట, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శృంగవరపుకోట. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని అంబాదాసు పాలెం గ్రామానికి చెందిన గడి బంగారు నాయుడు ఎంపికైనట్టు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశానుసారం జిల్లా డిసిసి అధక్షులు మారిపి విద్య సాగర్ నియామక పత్రాలను అందజేశారని. జిల్లాలో ప్రజలకు సేవ చేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ఆయన తెలిపారు. డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడిగా బంగారు నాయుడు ఎంపిక పట్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆనంద్ వ్యక్తం చేస్తూ బంగారు నాయుడుకు అభినందనలు తెలియజేశారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆర్డీవో చంద్రమోహన్






**బద్వేల్ మే 2 (ప్రజా జ్యోతి న్యూస్)** శుక్రవారం నాడు బ్రహ్మంగారిమఠం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం నందు బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల నాలుగో తేదీ నుండి 9వ తేదీ వరకు బ్రహ్మంగారిమఠం నందు జరగబోవు బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ఆరాధన ఉత్సవాలను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో మైదుకూరు డీఎస్పీ, రాజేంద్రప్రసాద్, డిపిఓ రాజ్యలక్ష్మి , డిఎల్డిఓ,బద్వేల్, శ్రీనివాసులు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ %ఱ% ఎక్సైజ్ సూపరింటెంట్ బి వినోద్ కుమార్, బ్రహ్మంగారిమఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయశాఖ మల్లికార్జున ప్రసాద్, బ్రహ్మంగారిమఠం మండలం తాసిల్దార్ దామోదర్ రెడ్డి, బ్రహ్మంగారిమఠం మండలం ఎంపీడీవో వీర కిషోర్. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి డివిజన్ స్థాయి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి దళిత జేఏసీ నూతన కమిటీ ఏర్పాటు



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మే 2, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్ళపూడి మండల దళిత జాయింట్ యాక్షన్ నూతన కమిటీని నియమించుకోవడం చేయడం జరిగిందని తాళ్లపూడి మండలం వైఎస్ఆర్సిపి దళిత నాయకులు తెలియజేశారు. దళితులకు ఏ సమస్య వచ్చిన సమస్యకు పరిష్కార దిశగా ఈ జేఏసీ పనిచేస్తుందని అన్నారు. సమాజంలో ఉన్న పేదవారిని ఆదుకోవాలని, అలాగే చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించే దిశగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ జేఏసీ ముఖ్య ఉద్దేశం చదువు, వైద్యం, సోషల్ సర్వీస్, పై ఉంటుందని తెలిపారు. ఈ జేఏసీ చైర్మన్ గా యాళ్ళ బాబురావు, వైస్ చైర్మన్ గా నూతంగి సురేష్, సెక్రెటరీ పిట్టా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ కొయ్య దుర్గారావు, ట్రెజరర్ సిర్రా గంగరావు, జాయింట్ ట్రెజరర్ పిట్టా రాంకి, మహిళా అధ్యక్షురాలు పోలిమాటి సత్యవతి, ఉపాధ్యక్షురాలు ముప్పిడి దమయంతి ,గౌరవ అధ్యక్షులు గుంటు చిన్నబ్బాయి, జొన్నకూటి పోసిరాజు లను మండలంలో ఉన్న ప్రతి గ్రామం నుండి ఇద్దరు చొప్పున కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ముందు ముందు సమాజానికి ఉపయోగపడే పనులతో ముందుకు సాగుతామని పిలుపునిచ్చారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడిమండలం, మే 2 ప్రజాజ్యోతి న్యూస్** సాధారణ తనిఖీలో భాగంగా తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సంబంధించిన రికార్డులను శుక్రవారం పరిశీలించిన డిప్యూటీ (డిఎం అండ్ హెచ్ఓ) సంధ్య. ప్రస్తుతం వేసవి కాలంలో అకాల వర్షాలు పడటం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో డాక్టర్లు స్నేహభావంతో మెలిగి వైద్య సేవలు అందించాలని అన్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక గుప్త, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

# సిహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కాకినాడ, కలక్టరేట్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న సిహెచ్‌ఓ (ఎంఎల్‌హెచ్‌పి) సమ్మెకు సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ సంపూర్ణ మద్దతు తెలియజేసారు. కలక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి విచ్చేసి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారి సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం లోని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చెయ్యకుండా వివక్ష చూపుతున్నదని, 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ ఇచ్చేవారని, గత 15 ఏళ్ళుగా అమల్కెన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. దీని వలన ఎన్‌హెచ్‌ఎం లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చెయ్యాలని, ఎంఎల్‌హెచ్‌పిలు వేతన పెంపు, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెంటీవ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కొరకు సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వలనే వారి సమ్మె అనివార్యమైంది. కనుక రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంఎల్‌హెచ్‌పి ల సంఘాల ప్రతినిధులందరితో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పైడితల్లి అమ్మవారి పండుగకు అందుతున్న ఆర్థిక తోడ్పాటు





**మేమున్నాం అంటూ ముందుకొస్తున్న దాతలు**

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** కోటి వరాల కల్పవల్లి శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగను 15 ఏళ్ళ తర్వాత గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పండుగ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు గత కొన్ని రోజులుగా పొందూరు పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తూ విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా దాతలు తాము ఉన్నాం అంటూ తమ వంతు సహకరంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు జరుపుకునే ఈ పండుగలో తమ వంతుగా మాదుగుల కామేశ్వర రావు ( ప్రిన్సిపాల్ ) రూ. 25 వేలు , ఎ.ఎఫ్. కె.కె సంఘం కార్యదర్శి దండా వెంకట రమణ రూ. 20 వేలు , మలిపెద్ది పార్వతి ,శ్రీరంగ నాయకులు రూ. 20 వేలు వీరితో పాటు పలువురు దాతలు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. ప్రతీ ఒక్కరూ అమ్మవారి పండుగకు తమ వంతు ఆర్థిక సహాయం అందజేసి పండుగ నిర్వాహణలో భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా పండుగ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శ్రీనివాస రావు, గుడ్ల మోహన్ ,కోరుకొండ విజయ్ కుమార్ ,కోరుకొండ రాజశేఖర్ ,మొకర సత్యన్నారాయణ ,ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ ,యర్రా సతీష్ , పాత్రికేయులు రాయిపిల్లి రాంబాబు , ఆనేం పాపారావు , మల్లిక భుజంగ రావు ,గుడ్ల సాయి రాజు ,అనకాపల్లి భవాని ,అనకాపల్లి చిన్న , మాసాడ భోగి రాజు ,మన్యాన వెంకట్రావు , అట్ల చంద్రశేఖర్ ,కోరుకొండ చంద్ర శేఖర్ , కాలెపు శ్రీనివాస రావు ,జి భాస్కర రావు ,కాకర్ల సాయి చైతన్య ,వడగా సూర్యం ,పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# పార్లమెంటరీ పరిశీలికులు మురళి రాజుకు
# అభినందనలు తెలియజేసిన వైసిపి శ్రేణులు







**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్...** –ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళి రాజు ను వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకునిగా నియమించడంతో మురళీకృష్ణంరాజు ను పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు చేరుకుని పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలు, గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ముదునూరి నివాస ప్రాంగణం జన సందడిగా మారింది. పార్టీలో మురళీకృష్ణంరాజు సేవలను గుర్తించి పరిశీలకునిగా నియమించడం పట్ల నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ నాకు అవకాశం ఇచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని, జగన్ నమ్మకాన్ని నిలబెడతానని, పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, జగన్ పాలనకు, ప్రస్తుత సర్కారుకు మధ్య తేడాను ప్రజలకు వివరించి అందరినీ కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శరభవరం ఎంపిటిసి అమరాధి కాశీ, రంగనాథ్ అబ్బాయి, అన్నవరం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష్, కిల్లాడి బాబ్జి, గొనగాని రామకృష్ణ, కోన బాబ్జి, బర్ల రాజబాబు తదితరులు పాల్గొన్నారు

# రాజధాని పునర్నిర్మాణం కాదు.. ఆంధ్రుల కలల పునరావిష్కరణ..

**ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు..**

**బాపట్ల, మే 2 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం కాదని అది ఆంధ్రుల కలల పునఆవిష్కరణ గా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. అమరావతి రాజధాని పునఃప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం రాకతో చీకట్లు పోయి వెలుగులు వచ్చాయి, నమ్మి ఇచ్చిన భూమి సద్వినియోగం అవుతోంది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరుతోంది అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రాజధాని లేని మనకు ప్రపంచ స్థాయి నగరం సిద్ధం అవుతోంది అన్నారు. ఇక మీద ఆంధ్రులు గర్వంగా, సగర్వంగా గుండెల మీద చేయి వేసుకుని మా రాజధాని అమరావతి అని చెప్పుకునే రోజు వచ్చిందని అన్నారు. నవయుగ ఆంధ్రప్రదేశ్‌కు నవ శకానికి నాంది పలుకుతూ, అమరావతి మరోసారి వెలుగులోకి వస్తోందని అన్నారు.కూటమి పాలనలో ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీకగా, అభివృద్ధి కాంక్షలకు మార్గదర్శకంగా అమరావతి మళ్లీ శక్తిని సంతరించుకుంది అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గిరి సంకల్పం తో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, అమరావతి గ్లోబల్ సిటీగా అవతరించి,దేశానికే తలమానికంగా తళుక్కుమంటూ ముందుకు సాగుతోంది అనడం లో ఎటువంటి సందేహం లేదు అని అన్నారు.ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుంటూ, అభివృద్ధి శంఖనాదానికి మేమూ తోడుగా నిలుస్తాంమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాస్ బాపట్లమున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి మున్సిపల్ డి కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారి జబ్బర్ సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ మెప్మా సుబ్రమణ్యం కోటయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు





## వేసవిలో గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.



**పోడూరు /ఆచంట.మే 2,ప్రజాజ్యోతి న్యూస్.** వేసవి నేపథ్యంలో గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతా బాయ్ అన్నారు. ఆచంట మండలం వల్లూరు, ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను, రూట్ మ్యాప్ ను, గర్భిణీ స్త్రీలను కొత్తగా నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ పనులను, ఫార్మసీ తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎండ తీవ్రత క్రమేపి పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి కొరత, జల కాలుష్యంతో డయేరియా, వడదెబ్బ ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఓ ఆర్ యస్ ప్యాకెట్లు, సెలైన్ బాటిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎండలో పనిచేయడం వల్ల కాలిష్యం, పొటాషియం సోడియం వంటివి చెమట రూపంలో బయటకు వెళ్లిపోయే ప్రమాదం ఉందని దీని ద్వారా అస్వస్థకు గురయ్య ప్రమాదం ఉందన్నారు. అందువల్ల తరచూ మంచినీళ్లు, లేదా గ్లూకోజ్ ఇతర లవణా ద్రావణాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. చెమట అధికంగా పట్టి అస్వస్థకు గురయ్యే లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలని ఆమె తెలిపారు . వేసవిలో గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్త తీసుకోవాలని స్వచ్ఛమైన నీరు,మజ్జిగ,కొబ్బరి నీళ్ళు తో పాటు పండ్ల రసాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలిపిన నీరు గ్లూకోజ్ త్రాగాలన్నారు. ఎండ బారిన పడితే శరీరము వేడెక్కి వాంతులు విరోచనాలు అవుతాయని కళ్ళు తిరిగే ప్రమాదం ఉందని వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజ, డాక్టర్ వేణుబాబు, డాక్టర్ హైందవి, ఎం పి హెచ్ ఈ ఓ శివకుమార్, హెచ్ వి వసంతకుమారి, సూపర్వైజర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ అంతా నేనే
## టిడిపి నేత అత్యుత్సాహం

**పేదల ఇళ్లను కూల్చేందుకు ప్లాన్.**




**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం పంచాయతీ రాజుల కల్లాలు సమీప గెడ్డను ఆనుకుని ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్న 15 నిరుపేద కుటుంబాలు వీళ్లంతా పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు. రెండు రోజుల క్రితం అక్కడి టిడిపి బడా నేత మీరు నివసిస్తున్న ఇళ్లను ఖాళీ చేయాలని అది ప్రభుత్వ స్థలమని హుఖం జారీ చేశారు. వెంటనే వీరు నివసిస్తున్న ఇంటి వెనకాల గెడ్డలో జెసిబి ని పెట్టి గెడ్డ ను వెడల్పు చేసేందుకు వీరు నివసిస్తున్న ఇంటి వెనల పునాదుల నుండి మెట్ల వరకు లోతుగా తవ్వేయడంతో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటి మీదగా గెడ్డ ప్రవహించడంతో వెనుక వైపు గెడ్డలో నివాసం ఉంటున్న ఇల్లులు అన్ని రానున్న రోజుల్లో కూలిపోయే ప్రమాదం ఉందని ఇక్కడ నివసి స్తున్న పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దీల రమణ ఆధ్వర్యంలో రాజుల కలాల గడ్డ పక్కన నివసిస్తున్న 15 కుటుంబాల కు చెందినవారు స్థానిక ఎమ్మార్వో అరుణ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కూలి పనులు చేసుకుంటూ గెడ్డ పక్కన నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తూ ఉన్నారు అని. వాటికి ఇంటి పన్నులు మరియు కరెంట్ బిల్లు చెల్లిస్తున్నారని కాబట్టి నివాసం ఉంటున్న నిరుపేదలకు నివేస స్థలంలో పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని. వారి ఇల్లు వెనుక ఉన్న గెడ్డ కాలువ వలన ఇళ్లకు ప్రమాదం జరగకుండా సైడ్ వాల్ నిర్మించి భద్రత కల్పించ వలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో. అచ్చియ్యమ్మా. పద్మ. డి .లక్ష్మి.డి. కొండమ్మ. రౌతు సూరమ్మ. ఎన్ నారాయణమూర్తి. సత్యవతి అమ్మ. తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 5న రాచపల్లిలో
## ఓమ్మి వారి గంగాలమ్మ తల్లి గావు సంబరం



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి గ్రామంలో నంది సెంటర్ దగ్గర ఉన్న ఓమ్మి వారి గంగాలమ్మ తల్లి ఆలయం వద్ద ఈ నెల 5న గంగాలమ్మ తల్లి గావు సంబరం నిర్వహిస్తున్నట్లు ఓమ్మి వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు. అలాగే ఆదివారం అమ్మవారిని దింపడం, తప్పిడే గుళ్ళు (గరిడీలు) ఆటలు, సోమవారం సాయంత్రం అమ్మవారు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ గంగాలమ్మ తల్లి జాతర మహెూత్సవం కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువత మహిళలు, పరిసర గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నారు

## మురళీకృష్ణ రాజుని మర్యాదపూర్వకంగా అభినందనలు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర** నరసాపురం పార్లమెంటు పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా ముదునూరి మురళీకృష్ణ రాజు ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన శరభవరం ఎంపీటీసీ అమరాది కాశీ ,పోతులూరు సర్పంచ్ బొండి రాంబాబు ,ఎలుగుబంటి బాబ్జి ,రంగనాథ్ అబ్బాయిగారు,కిల్లాడి బాబ్జి ,కోలా తాతబాబు ,కోన బాబ్జి ,బొల్లు నాగేశ్వరరావు ,గోనగాని రామకృష్ణ ,కోలా సూరిబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,పెండ్యాల అబ్బు ,దాడి శ్రీను ,నల్ల వెంకటేష్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శంకర జయంతి శోభాయాత్ర



**మే 2,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతిలో శుక్రవారం శృంగేరీ శంకర మఠం లో శంకర జయంతి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్థానిక శంకర మఠం నుంచి శ్రీ కోదండరామస్వామి ఆలయం నాలుగు మాడ వీధుల్లోనూ పల్లకి సేవతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. జయ జయ శంకర నినాదాలు చేస్తూ శోభాయాత్రను చేపట్టారు. మహిళలు ఆది శంకరాచార్యుల చిత్రపటాలను ఊరేగించారు. మఠం ధర్మాధికారి రాళ్లపల్లి రామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి శాఖ ముఖ్య కార్యదర్శి గంద్రకోట లక్ష్మీ మనోహర్, మఠం మేనేజర్ నడింపల్లి కృష్ణ, పూర్ణ చంద్ర, సురభి మురళి తదితర భక్తులు పాల్గొన్నారు.

## బొదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామి ఆధ్వర్యంలో అమరావతికి తరలిన తెలుగు తమ్ముళ్లు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్.... ఏలేశ్వరం** రాజధాని అమరావతి పునః పునః నిర్మాణ పనుల సందర్భంగా అమరావతిలో శుక్రవారం దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభలో పాల్గొనడానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయితీ నుండి బస్సుల్లో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం తరలి వెళ్లారు. బస్సులను తెలుగుదేశం పార్టీ నాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అధునాతన ఆంధ్రప్రదేశ్ కు చోదక శక్తిగా అమరావతి నగర నిర్మాణం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న దృష్ట్యా ఇందుకు అందరూ తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి వెళుతున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకుని తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపించండి వాహనదారులు విజ్ఞప్తి



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మే 2 ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం ప్రక్కిలంక మెయిన్ రోడ్ పిండ వెంకటేశ్వరరావు క్వార్టర్స్ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డు చెరువును తలపిస్తుంది. గురువారం రాత్రి కురిసిన చిన్న వర్షానికే రోడ్డుపై నీరు నిలవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందికి గురయ్యారు. ద్విచక్ర దారులు మహిళలు చిన్న పిల్లలతో ఆ రోడ్డులో ప్రయాణం చేయడానికి సాహసించడం లేదు. గతంలో డ్రైనేజీ ప్రాబ్లం కారణంగా స్థానిక నాయకులు స్పందించి సమస్యను తీర్చిన సరే తిరిగి మళ్లీ సమస్య పునరావృతం అయింది. వర్షాకాలం రాకముందే శాశ్వత పరిష్కారం చూపించాలని లేదంటే నీళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మదనంతపురం లో ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట...కార్యక్రమంలో పాల్గొన్న,వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ గుంత రఘు,

విచ్చేసిన అతిధులను ఘనంగా సన్మానించిన మదనంతపురం వాల్మీకి ఉత్సవ కమిటీ..



**ప్రజా జ్యోతి తుగ్గలి,మద్దికేర,** మద్దికేర మండల మైన మదనంతపురం గ్రామంలో ,వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టలను శుక్రవారం గ్రామ పెద్దలు ప్రజలు ఘనంగా నిర్వహించారు నూతనంగ విగ్రహాన్ని వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ గుంత రఘు,మాట్లాడుతూ అదేవిధంగా గ్రామ వాల్మీకిల ఐక్యతతో ఉండాలని ఆయన సూచించారు,గ్రామ పెద్దలు మరియు ప్రజల సహకారంతో విగ్రహ ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిధులను శాలువాలు పూలమాలతో ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో మద్దికేర మాజీ ఎంపీపీ ధనుంజయ్,వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత రఘు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, మదనంతపురం నగేష్,రాయుడు,హనుమన్న,రంగడు, సంజీవ,శీను,భాస్కర్, బసిరెడ్డి,పెద్దల ఆధ్వర్యంలో ,వాల్మీకి మహర్షి విగ్రహాలను గ్రామ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ట అనంతరం లు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు,వాల్మీకి సోదరులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ కార్యక్రమం విజయవంతం..

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి..**
**అధికారులకు అభినందనలు తెలిపిన కలెక్టర్..**





**బాపట్ల, మే 2 ( బాపట్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అభినందనలు తెలిపారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోధీ అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం కు విచ్చేయుచున్న సందర్భంగా జిల్లా నుంచి తరలి వెళ్తున్న ప్రజలకు కోసం ఏర్పాటు చేసిన బస్సుల కదలికలను తీసుకునేందుకు కలెక్టరేట్లో వీక్షణ సమావేశం మందిరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లో బస్సు కదలికలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుండి 380 బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అద్దంకి నియోజకవర్గం నుండి 71 బస్సులను ఏర్పాటు చెయ్యగా అందులో 3 వేల మంది, బాపట్ల నియోజకవర్గం నుండి 68 బస్సులలో 2750 మంది, రేపల్లె నియోజకవర్గం నుండి 58 బస్సులలో 2500 మంది, వేమూరు నియోజకవర్గం నుండి 52 బస్సులలో 2250 మంది, పర్చూరు నియోజకవర్గం నుండి 72 బస్సులలో 3 వేల మంది, చీరాల నియోజకవర్గం నుండి 59 బస్సులలో 2500 మంది మొత్తం జిల్లా నుండి 16 వేల మంది అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి హాజరయ్యారని ఆయన తెలిపారు. బాపట్ల నియోజకవర్గం నుండి వెళ్లే బస్సులకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన భోజన స్టాల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి భోజనం ఏర్పాటును పరిశీలించారు. బస్సులోని ప్రయాణికులకు అన్ని అందినీయ లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన నాలుగు భోజన స్టాల్స్ నుండి ప్రయాణికులందరికీ భోజనం అందజేయమైనదని ఆయన తెలిపారు. ఈ బస్సులన్నీ కార్యక్రమానికి ఎటువంటి ఆటకం లేకుండా చేరుకున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమం అనంతరం రాత్రి భోజన సదుపాయాలు కల్పించడమైనదని ఆయన అన్నారు. అన్ని బస్సులు వారి గమ్యస్థానానికి చేరేవరకు కమాండ్ కంట్రోల్ లోని సిబ్బంది ఆ బస్సులలోని అధికారులతో నిరంతరము పర్యవేక్షణలో ఉంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, కమాండ్ కంట్రోల్ నందు విధులు కేటాయించిన సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి మోడీ పర్యటన విజయవంతం...

**విజయానికి తమ వంతు కృషి చేసిన జిల్లా అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్...**



**బాపట్ల మే 2 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమమును విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అభినందనలు తెలిపారు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోధీ అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి విచ్చేయు సందర్భంగా జిల్లా నుంచి తరలి వెళ్లిన ప్రజలకు ఏర్పాటు చేసిన బస్సుల గమ్యస్థానాలను తెలుసుకునేందుకు బాపట్ల కలెక్టరేట్లో వీక్షణ సమావేశం మందిరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లో బస్సుల యొక్క గమ్యస్థానాలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుండి 380 బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు అద్దంకి నియోజకవర్గం నుండి 71 బస్సులను ఏర్పాటు చేయడమైనది అందులో 3 వేల మంది, బాపట్ల నియోజకవర్గం నుండి 68 బస్సులలో 2750 మంది, రేపల్లె నియోజకవర్గం నుండి 58 బస్సులలో 2500 మంది, వేమూరు నియోజకవర్గం నుండి 52 బస్సులలో 2250 మంది, పర్చూరు నియోజకవర్గం నుండి 72 బస్సులలో 3 వేల మంది, చీరాల నియోజకవర్గం నుండి 59 బస్సులలో 2500 మంది మొత్తం జిల్లా నుండి 16 వేల మంది అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి హాజరయ్యారని ఆయన తెలిపారు బాపట్ల నియోజకవర్గం నుండి వెళ్లే బస్సులకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన భోజన స్టాల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి భోజనం ఏర్పాటును పరిశీలించారు బస్సులోని ప్రయాణికులకు అందరికీ ఆహారం నీరు అందజేశారా లేదా స్వయంగా అడిగి తెలుసుకున్నారు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన నాలుగు భోజన స్టాల్స్ నుండి ప్రయాణికులందరికీ భోజనం అందజేయడం జరిగిందని చెప్పారు ఈ బస్సులన్నీ కార్యక్రమానికి ఎటువంటి ఆటకం లేకుండా చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమం అనంతరము రాత్రి భోజన సదుపాయాలు కల్పించామని చెప్పారు అన్ని బస్సులు వారి గమ్యస్థానానికి చేరేవరకు కమాండ్ కంట్రోల్ లోని సిబ్బంది ఆ బస్సులలోని అధికారులతో నిరంతరము పర్యవేక్షణలో ఉంటారని కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, కమాండ్ కంట్రోల్ నందు విధులు కేటాయించిన సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ మరో రోజు గడువు



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ గడువును పెంచింది. ఈ ఎల్ఆర్ఎస్‌లో భాగంగా భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అదే టైంలో సాంకేతికంగా కూడా ఫీజులు చెల్లించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నార. అందుకే ప్రజల నుంచి వస్తున్న స్పందనతోపాటు క్లియర్ చేయాల్సిన ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్లు క్రమబద్దీకరించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునే ఫెసిలిటీ కల్పించింది. ఈ గడువు ఏప్రిల్ 30తో ముగిసింది. దీన్ని మరో మూడు రోజులు అంటే మే 3 వరకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు రాత్రి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సెక్రటరీ టీకే శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు. అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో ల్యాండ్ రెగ్యులలరైజేషన్ స్కీమ్‌ను తీసుకొచ్చారు. కొంత ఫైన్‌తో అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఆమోదిస్తుంది. అలాంటి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అంగీకరిస్తుంది. అందుకే ఈ స్కీమ్ కింద భారీ సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. 2025 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద ఫీజులు చెల్లించే వారికి 25 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ మార్చి 31 నాటికి చెల్లించే వారికి మాత్రమే వర్తిస్తుందని మొదట పేర్కొంది. అయితే చాలా మంది దరఖాస్తుదారులు సాంకేతిక సమస్యలు, వెబ్‌సైట్‌లో లోపాలు, ఇతర అడ్డంకుల వల్ల చెల్లింపులు చేయలేకపోయారు. వారి అభ్యర్థన మేరకు గడువును ఏప్రిల్ 30 వరకు పెంచారు. అయినా ఇంకా చాలా మంది దరఖాస్తు చేసుకోలేదు. దీంతో మరో మూడు రోజులు ఆఖరి ఛాన్స్ ఇస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ పథకం కింద దరఖాస్తుదారులు రెగ్యులరైజేషన్ ఫీజుతోపాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ ఛార్జీలను కూడా చెల్లించవచ్చు. ఈ రెండింటిపై 25 శాతం రాయితీ వస్తుంది. మే 3 లోపు చెల్లించే వాళ్లకే ఈ రాయితీ వర్తిస్తుంది. తర్వాత చెల్లిస్తే కచ్చితంగా వంద శాతం ఫీజు కట్టించుకుంటారు. ఈ స్కీమ్ నుంచి భారీగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం ఆశించింది. చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో భారీ సంఖ్యలో క్రమబద్దీకరణకు వస్తారని ఆలోచించింది. మార్చి చివరి నాటికి రెండు లక్షల మంది దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. ఏప్రిల్ 30 నాటికి మరో లక్షన్నర దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అనుకుంటున్నారు. ఈ మూడు రోజుల గడువు పెంపుతో మరిన్ని దరఖాస్తులు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు. ప్రభుత్వం దరఖాస్తుదారులకు మూడు రోజుల గడువులో చెల్లింపులు పూర్తి చేయాలని సూచించింది. ఎల్ఆర్ఎస్ పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవచ్చు. మీ అప్లికేషన్ స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. సమస్యలు ఎదురైతే హెచ్ఎండీ ఫోన్ నెంబర్ 18005998838కి ఫోన్ చేసి సాయం పొందవచ్చు. మేడే సెలవు అయినప్పటికీ ఈ పోర్టల్ పని చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

# ఎరక్కపోయి వచ్చామే...

**హైదరాబాద్ :** గులాబీ గూటినుంచి కాంగ్రెస్ లోకి వలస వచ్చిన 10 మంది పరిస్థితి ఇప్పుడు ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారిందట. వలసొచ్చిన కాంగ్రెస్ పార్టీలో మనస్ఫూర్తిగా ఉండలేకపోతున్నారు. అలాగని తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న చర్చ తెలంగాణ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.మరోవైపు సుప్రీంకోర్టు ఏ క్షణంలో ఎలాంటి తీర్పునిస్తుందో అన్న టెన్షన్ 10 మందిని వెంటాడుతోందట. భవిష్యత్తు బావుంటుందన్న ఆశతో అధికార హస్తం పార్టీలో చేరితే..మొదటికే మోసం వస్తుందా అన్నమానాలు వారిని వెంటాడుతున్నాయట. బీఆర్ఎస్ పార్టీలో కారుగుర్తుపై గెలిచి..ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారట. కాంగ్రెస్ లో చేరిన వెంటనే తాము కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉంటూ ఇక అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చని అంతా భావించారు. కానీ ఇక్కడే వ్యవహారం బెడిసికొట్టింది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఆ పది మంది ఎమ్మెల్యేలను అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దగా గుర్తించడంలేదట.ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి,పార్టీలోని ముఖ్య నేతలు, మంత్రులెవరూ తమను పెద్దగా పట్టించుకోవడంలేదని.. పార్టీలోకి వస్తే ఇది చేస్తాం? అది చేస్తామంటూ ఇచ్చిన హామీలపై కనీసం మాటకూడా మాట్లాడడంలేదని 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ, ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారట. దీంతో తాము పార్టీ మారి తప్పు చేశామా అనే సందిగ్ధంలో పడ్డారట ఆ 10 మంది ఎమ్మెల్యేలు.అయితే కొంత మంది ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి వెళ్తే ఎలా ఉంటుందని ఆలోచన కూడా చేసినట్లు తెలుస్తోంది. గూడెం మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, దానం నాగేందర్ వంటి వలస ఎమ్మెల్యేలు మళ్ళీ బీఆర్ఎస్ లోకి వెళ్లేందుకు ప్రయత్నం కూడా చేశారన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పించినా..ఆ పది మంది ఎమ్మెల్యేలను ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని గులాబీ బాస్ కేసీఆర్ స్ట్రాంగ్ నిర్ణయం తీసుకున్నారట.పార్టీలోకి వచ్చేందుకు ట్రై చేసిన ఆ ఎమ్మెల్యేలకు నో ఛాన్స్ అని వారి మొహం మీదే చెప్పేశారట పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. దీంతో ఏం చేయాలో పాలుపోక..బిక్కమోహంతో కాంగ్రెస్ పార్టీలో కొట్టుమిట్టాడుతున్నారట పార్టీ మారిన ఆ 10 మంది




ఎమ్మెల్యేలు. తమ రాజకీయ భవిష్యత్ ఏంటంటూ దిగాలుగా ఉన్నారని పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కేటీఆర్, పాడికౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయడంతో..ఏ క్షణంలో కోర్టు ఎటువంటి తీర్పునిస్తుందో అని తెగ టెన్షన్ పడుతున్నారట వారంతా. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారని స్పీకర్ పై ఇప్పటికే తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు..స్పీకర్ తో పాటు ఆ పదిమంది ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇచ్చి విచారణ కూడా జరిపింది.దీంతో కోర్టు తీర్పుపై ఆ 10మంది ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే తమపై ఖచ్చితంగా వేటు పడడం ఖాయమంటూ కొంతమంది ఎమ్మెల్యేలు అనుమానం వ్యక్తం చేస్తున్నారట. ఒకవైపు కాంగ్రెస్ లో ఉండలేక, మరోవైపు తిరిగి గులాబీ గూటికి వెళ్లలేక ఆ పది మంది ఎమ్మెల్యేలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.మొత్తానికి కారుగుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేల పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్లుగా ఉందట. వెళ్లే దారులన్నీ మూసుకుపోవడంతో? ఎలా ముందుకు వెళ్లాలో?ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారట. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే వీరి పరిస్థితిపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటూ తెలంగాణ రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. పార్టీమారిన ఎమ్మెల్యేలపై ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు పడితే మాత్రం ఉప ఎన్నికలు రావడం ఖాయం.అయితే బై ఎలక్షన్లో గెలిస్తే సరి..ఒకవేళ ఓడిపోతే భవిష్యత్ ఏంటన్న ఆందోళన పార్టీ మారిన ఆ 10 ఎమ్మెల్యేలను వెంటాడుతోందట. ఎందుకంటే సుప్రీం తీర్పు నేపథ్యంలో బై ఎలక్షన్స్ వస్తే?ఆ 10 నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను దించాలని ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ ప్రయత్నాలను మొదలుపెట్టినట్లు టాక్ విన్పిస్తోంది. ఆ దిశగా ఇప్పటికే కాంగ్రెస్ లో అసంతృప్తితో కొట్టుమిట్టలాడుతున్న నేతలకు గాలం వేస్తున్నట్లు సమాచారం. ఐతే ఇవన్నీ లెక్కలు తేలాలంటే సుప్రీంకోర్టు తీర్పునిచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే.

# మాయం కానున్న మూసీ మురుగు

**హైదరాబాద్ :** మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. రూ. 3,100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్లు నిర్మించనున్నారు. 80 శాతం మురుగు మూసీలోకి చేరుతుండటంతో.. 39 అదనపు ఎస్టీపీలను నిర్మించనున్నారు. నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరం, దక్షిణం వైపు ట్రంక్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.హైదరాబాద్ నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి.. లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.గతంలో జంట జలాశయాల



నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది.ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ 2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు

**సిద్దిపేట :** 4వ తేదీన జిల్లాలో నిర్వహించే యూజీ నీట్ 2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు యూజీ నీట్ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులు హాల్ టికెట్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటో, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర ఏదేని ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకొని రావాలని అన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరని అన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 883 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను సమకూర్చడం జరిగిందని ఆర్టీసీ బస్సులను కూడా విద్యార్థులను సమయానికి పరీక్ష కేంద్రాలకు చేర్చేలా ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష అధికారుల నియామకం, శిక్షణ పూర్తయిందని విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని తెలిపారు.



## పిల్లలమర్రికి... అందాల భామలు

**మహబూబ్ నగర్ :** హైదరాబాద్ మే 7 నుండి 31 వరకు 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. 120 దేశాల నుండి 140 మంది పోటీదారులు హాజరుకానున్నారు. తెలంగాణ సంస్కృతిని చాటేలా పర్యాటక ప్రాంతాల సందర్శన, విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో పాల్గొనే అందాల భామలను రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.తొలుత 21 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని భావించినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లల మర్రిని కూడా ఈ జాబితాలో చేర్చారు.హైదరాబాద్ నగరం త్వరలో అంతర్జాతీయ అందాల పోటీలకు వేదిక కానుంది. 72వ మిస్ వరల్డ్ పోటీలు మే 7వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి దాదాపు 120 దేశాల నుండి 140 మందికి పైగా పోటీదారులు.. ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈసారి పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.విదేశీ అతిథులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పోటీల్లో పాల్గొనే అందాల భామలను రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. తొలుత 21 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని భావించినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లల మర్రిని కూడా ఈ జాబితాలో చేర్చారు.దీంతో సందర్శించే ప్రాంతాల సంఖ్య 22కు చేరుకుంది. అలాగే.. తొలుత హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించాలని అనుకున్నప్పటికీ.. దాని స్థానంలో చారిత్రాత్మక వేయి స్తంభాల గుడిని చేర్చారు. మిగిలిన 20 పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. విమానాశ్రయంలో దిగినప్పటి నుండి అతిథులకు తెలంగాణ ఆతిథ్యం.. సంస్కృతిని పరిచయం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో తెలుగు సంప్రదాయానికి అనుగుణంగా బొట్టు పెట్టి,మంగళహార తులతో ఘనంగా స్వాగతం పలకడానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తోంది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ , పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి స్వయంగా విమానాశ్రయాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్ల కోసం శంషాబాద్ పోలీసు అధికారులతో సమావేశమై సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అధికారులతో సమావేశమై.. అందాల పోటీల వేదికల వద్ద ఏర్పాట్లు.. విదేశీ అతిథుల బస, వసతి సౌకర్యాలు.. భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు ప్రభుత్వం త్వరలో ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయనుంది. ఈసారి మిస్ వరల్డ్ పోటీలు కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా.. తెలంగాణ గొప్ప సంస్కృతి, కళలు,పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఒక గొప్ప వేదికగా మారనుంది.

## రాజకీయాల్లో కొత్త గీత

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. రాబోయే 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసురుతూ, కాంగ్రెస్ దీర్ఘకాల పాలనకు బలమైన సంకేతంగా కనిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఈ ధీమాకు మూలమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. కేసీఆర్ రాజకీయంగా ఒంటరిగా మారి, ఫార్మ్ హౌస్‌కే పరిమితమవుతారని,ఆయన రాజకీయ ప్రస్థానం ముగిసిపోతుందని ఘాటుగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తిని రేకెత్తించగా, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఇటీవలి ఎన్నికల్లో ఎదురైన ఓటములు, పార్టీలో అంతర్గత సమస్యలు రేవంత్ వ్యాఖ్యలకు బలం చేకూర్చాయని విశ్లేషకులు చెబుతున్నారు.ఉప శీర్షిక 3: తెలంగాణ రాజకీయాల్లో కొత్త గీత రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయా? కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తోంది. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు పథకం, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యల ద్వారా ప్రతిపక్షాలను రెచ్చగొట్టి, తమ పార్టీ బలాన్ని చాటాలని చూస్తున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.తెలంగాణలో 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి, దశాబ్దాల తర్వాత అధికారంలోకి వచ్చింది.

**ఈ విజయం రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఊపిరిపోసింది**

**ప్రతిపక్షాల స్పందన**

బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ఇంకా రాజకీయంగా బలంగా ఉన్నారని, రేవంత్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత దాడిగా ఉన్నాయని విమర్శించారు. సామాన్య ప్రజలు ఈ వ్యాఖ్యలను రాజకీయ డ్రామాగా భావిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పాలనపై సానుకూల దృక్పథం ఉన్న వారు రేవంత్ ధీమాను సమర్థిస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం రాజకీయ ఆరోపణలుగానే కాక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాల లక్ష్యాలను సూచిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతాయా లేక రాజకీయ శత్రుత్వాన్ని మరింత పెంచుతాయా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## బీఆర్ఎస్‌లో చేరికలు


**జహీరాబాద్ :** జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 50 మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో బిఆర్ఎస్లో చేరారు. న్యాలకల్ మండల్ రత్నపూర్ గ్రామం నుండి 50 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్లో ఎమ్మెల్యే మాణిక్ రావు ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. బీజేపీ నేతలు మాజీ ఎంపీటీసీ దేశీటి పటేల్, రవి కుమార్, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు తుకారాం, భాస్వరం, సంగశీటి, సంజీవ్, అమృత్ తదితరులకు హరీష్ రావు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ తెలంగాణను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. తెలంగాణకు అన్యాయం తప్ప ఏం చేయలేదు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టు ను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోంది. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుంది. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు ఎందుకు రావడం లేదు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్షం ప్రజలకు శాపంగా మారింది. ప్రజలకు కాంగ్రెస్ మోసం తెలిసిపోయింది. మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యం అవుతుందని అన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట పోరండ్ల గ్రామస్థుల ఆందోళన

**జగిత్యాల :** తన భూమి అక్రమించారని పోరండ్ల రైతు మల్లారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎకరంన్నర వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. రైతు ఆత్మహత్యకు గ్రామంలోని ముగ్గురితో పాటు పోలీసులే కారణమని స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేసారు. న్యాయం జరిగే వరకు కదలని రైతు కుటుంబసభ్యులు అంటున్నారు..

## నీళ్లు లేక ఎడారిగా మారిన దేవాదుల,సమ్మక్క సాగర్ ప్రాజెక్టులు


**ములుగు :** ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం లోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్,తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజి లో నీళ్ళు లేక ఎడారిని తలపిస్తున్నాయి.ఎగువ ఇన్ఫ్లో తగ్గడంతో ప్రాజెక్టుల వద్ద ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి.ఎగువ నుంచి ఇన్ఫ్లో తగ్గడంతో పాటు బ్యారేజి లో నీరు ఎక్కువగా లేకపోవడంతో దేవాదుల ఇంటెక్ వేల్ వద్ద కొన్ని మోటార్లను నిలిపివేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజి జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గి పోయాయి.



# ఇవి తింటే రోగాలు నయమవుతాయో తెలుసా..

నల్ల టమాటాలు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అవి తక్కువ కేలరీలను కలిగి ఉండటం వల్ల బరువు నిర్వహణకు కూడా ఉపయోగపడతాయి. అంతేకాదు, వాటిలోని యాంటీఆక్సిడెంట్లు సూర్యుని యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. నల్ల టమాటాలు.. వాటి ప్రత్యేకమైన రంగుతో మాత్రమే కాదు. ఆరోగ్యప్రయోజనాల కారణంగా కూడా ఎంతో గుర్తింపును తెచ్చుకున్నాయి. సాధారణ ఎరుపు టమాటాల కంటే ఇవి అధిక మొత్తంలో యాంటీఆక్సిడెంట్లు ఇతర పోషకాలను కలిగి ఉంటాయి. నల్ల టమాటాలు ఆరోగ్యానికి అందించే ఐదు ముఖ్యమైన ప్రయోజనాలను వివరంగా తెలుసుకుందాం. నల్ల టమాటాలు యాంటీఆక్సిడెంట్ల గనిగా పిలవబడతాయి, ముఖ్యంగా ఆంథోసైనిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఇందులో సమృద్ధిగా ఉంటుంది. ఈ ఆంథోసైనిన్‌లు నల్ల టమాటాలకు వాటి గాఢ రంగును అందిస్తాయి మరియు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించడం ద్వారా క్యాన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. నల్ల టమాటాలలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి కొలాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది, ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు గాయాలను త్వరగా నయం చేయడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో నల్ల టమాటాలను చేర్చడం ద్వారా శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచవచ్చు. నల్ల టమాటాలలో లైకోపీన్, పొటాషియం మరియు ఇతర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. లైకోపీన్ రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది, అయితే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ పోషకాలు గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించి, హృదయ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. నల్ల టమాటాలను ఆహారంలో చేర్చడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని సహజంగా కాపాడుకోవచ్చు.నల్ల టమాటాలలో విటమిన్ ఎ మరియు బీటా-కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి, ఇవి కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

# ఈ సమయాల్లో స్నానం చేస్తే ఇబ్బందులు తప్పవు



స్నానం ఎప్పుడు పడితే అప్పుడు చేస్తున్నారా.. అయితే, మీ తప్పు లేకుండానే ఈ ఆరోగ్య సమస్యలన్నీ కొనితెచ్చుకున్నవారవుతారు. ఈ మాట ఎవరో అంటున్నది కాదు. అటు మానసిక శారీరక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక మార్గంలో వెళ్లాలనుకునే వారు కూడా ఈ విషయం తప్పకుండా తెలుసుకుని తీరాలి. స్నానం చేయకూడని సమయంలో చేస్తే ఎన్నో వ్యాధులకు వెల్కం చెప్పినవారవుతారని నిపుణులు చెప్తున్నారు. స్నానం మన ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో మేలు చేస్తుంది. అయితే, సాంప్రదాయ విశ్వాసాల ప్రకారం, కొన్ని నిర్దిష్ట సమయాల్లో స్నానం చేయడం ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక సమతుల్యతకు హాని కలిగించవచ్చని నమ్ముతారు. ఈ విషయంలో అజాగ్రత్త వహిస్తే శారీరక, ఆధ్యాత్మిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. స్నానం చేయకూడని నాలుగు సమయాల గురించి, అవి ఎందుకు నిషిద్ధమని భావిస్తారో తెలుసుకుందాం. భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం సాంప్రదాయ ఆరోగ్య సూత్రాల ప్రకారం నిషేధం. భోజనం తర్వాత, శరీరంలో రక్తప్రసరణ ప్రధానంగా జీర్ణవ్యవస్థ వైపు కేంద్రీకృతమవుతుంది. ఈ సమయంలో స్నానం చేస్తే, రక్తప్రవాహం చర్మం వైపు మళ్లి, జీర్ణక్రియకు అంతరాయం కలిగించవచ్చు. దీనివల్ల అజీర్ణం, గ్యాస్, లేదా ఇతర జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే, భోజనం చేసిన కనీసం ఒక గంట తర్వాత స్నానం చేయడం ఉత్తమం. అర్ధరాత్రి లేదా రాత్రి లోతుగా స్నానం చేయడం కూడా సాంప్రదాయంలో నిషిద్ధమని చెబుతారు. ఈ సమయంలో శరీరం విశ్రాంతి తీసుకునే స్థితిలో ఉంటుంది, మరియు రాత్రి వాతావరణం చల్లగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గే ప్రమాదం ఉంది. ఇది జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలకు దారితీయవచ్చు. అంతేకాదు, ఆధ్యాత్మిక దృక్కోణంలో, రాత్రి సమయంలో ప్రతికూల శక్తుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు, ఇది మానసిక సమతుల్యతను దెబ్బతీస్తుంది. జ్వరం, జలుబు లేదా ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు స్నానం చేయడం మానుకోవాలి. ఈ సమయంలో శరీరం బలహీనంగా ఉంటుంది, మరియు చల్లని నీటితో స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత మరింత తగ్గి, ఆరోగ్యం మరింత దిగజారే అవకాశం ఉంది. వైద్యుల సలహా మేరకు, అవసరమైతే వెచ్చని నీటితో తేలికపాటి స్పాంజ్ బాత్ చేయడం మంచిది, కానీ పూర్తి స్నానం నివారించడం ఉత్తమం. సూర్యాస్తమయం తర్వాత, ముఖ్యంగా సాయంత్రం లేదా రాత్రి సమయంలో స్నానం చేయడం సాంప్రదాయంలో నిషేధించబడింది. ఈ సమయంలో శరీరం రోజంతా పనిచేసిన తర్వాత విశ్రాంతి మోడ్‌లోకి వెళుతుంది. స్నానం చేయడం వల్ల శరీర సహజ లయ భంగమవుతుంది, ఇది కీళ్ల నొప్పులు, అలసట, లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అంతేకాదు, సాంప్రదాయ విశ్వాసాల ప్రకారం, సాయంత్రం సమయంలో ప్రతికూల శక్తుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది ఆధ్యాత్మిక అసమతుల్యతకు కారణమవుతుందని చెబుతారు.


# మైదా వంటకాలు తెగ తింటున్నారా..?



రిఫైన్డ్ గోధుమ పిండినే మైదా అని పిలుస్తారు. బయట మనం తినే చాలా రకాల ఆహారాల్లో మైదా పిండినే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. గోధుమ పిండిలోని ఫైబర్‌ను పూర్తిగా తొలగించి రీఫైన్ చేసి ఈ మైదా పిండిని తయారు చేస్తారు. అందువల్ల మైదా పిండిలో కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. అంతే తప్ప మన ఆరోగ్యానికి ఎలాంటి మేలు లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మైదా తినడం వల్ల లాభం కంటే.. నష్టాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లటి విషంగా మైదాను చెబుతుంటారు నిపుణులు. రీఫైన్డ్ చేసిన గోధుమ పిండిలో పోషకాలు ఉండవు. ముఖ్యంగా ఫైబర్ అసలే ఉండదు. బి విటమిన్లు అయిన థయామిన్, నియాసిన్, ఫోలేట్, ఐరన్, మెగ్నిషియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా కోల్పోవాల్సి వస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఇందులో గ్లైసీమిక్ ఇండెక్స్ అధికంగా ఉంటుందని చెబుతున్నారు. ఫలితంగా మైదా వంటకాలతో రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మైదాను తరచూ తింటూ ఉండటం వల్ల దీర్ఘకాలంలో షుగర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే షుగర్ ఉన్నవారు మైదాను తింటే షుగర్ మరింత పెరిగి ప్రాణాపాయం సంభవించే పరిస్థితులు ఏర్పడుతాయి. కనుక మైదా మనకు పూర్తిగా హానికరం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పిండి పదార్థాలను అధికంగా తీసుకుంటే శరీరంలో ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. దీంతో శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను కణాలు సరిగ్గా గ్రహించలేవు. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది డయాబెటిస్‌కు దారి తీస్తుంది. ముఖ్యంగా బరువు పెరగడంతోపాటు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంటుంది.అలాగే మైదాను తింటే ఆకలి అంత త్వరగా తీరదు. దీంతో ఆహారం మరింతగా తింటారు. దీని వల్ల శరీరం శక్తిని కోల్పోయినట్లు అవుతుంది. నీరసంగా మారుతారు. అలసటగా అనిపిస్తుంది. అలాగే మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కనుక మైదాకు వీలైనంత దూరంగా ఉంటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.మైదాతో తయారు చేసిన ఆహారాలను తినకుండా మనస్సును డైవర్ట్ చేసుకునే ప్రయత్నం చేయాలి. ఆయా ఆహారాలకు బదులుగా పండ్లు, నట్స్, విత్తనాలను తినాలి. ఇవి ఆకలిని తగ్గించడమే కాదు, పోషకాలను కూడా అందిస్తాయి. శరీర బరువు తగ్గేందుకు, షుగర్ లెవల్స్ అదుపులో ఉండేందుకు సహాయం చేస్తాయి. రోగాలను తగ్గించడంలో దోహద పడతాయి.

# ఆరోగ్యంగా ఉండాలంటే చక్కెరను కంట్రోల్ చేసుకోవాల్సిందే..

ఈ రోజుల్లో అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఊబకాయం నుంచి గుండె జబ్బులు వరకు అన్ని సమస్యలూ చక్కెర మోతాదుతో సంబంధం కలిగి ఉంటాయి. ఔనా సూచనల ప్రకారం రోజువారీ చక్కెర పరిమితిని పాటించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజుల్లో అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. చక్కెర తక్కువగా తీసుకుంటే ఊబకాయం, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు దూరం కావచ్చు. అందుకే ప్రతిరోజూ ఎంత మోతాదులో చక్కెర తినాలో తెలుసుకోవడం అవసరం.ఔనా సూచనల ప్రకారం పురుషులు రోజుకు 36 గ్రాముల వరకు అదనపు చక్కెర మాత్రమే తీసుకోవాలి. అంటే దాదాపు 9 టీస్పూన్లు. దీని కంటే ఎక్కువ తింటే శరీరంలో కేలరీలు అధికమవుతాయి. ఇది బరువు పెరగడానికి దారి తీస్తుంది. కొంతకాలం తర్వాత ఇతర ఆరోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.2 నుండి 18 సంవత్సరాల వయసు పిల్లలు రోజుకు 25 గ్రాముల లోపే చక్కెర తినాలని సూచించబడింది. అంటే సుమారుగా 6 టీస్పూన్లు. ఈ వయసులో ఎక్కువగా చక్కెర తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల వారిలో డయాబెటిస్ ముప్పు పెరుగుతుంది. చిన్నపిల్లలకు తక్కువ చక్కెర తినే అలవాటు పెడితే భవిష్యత్తులో ఆరోగ్యంగా జీవించవచ్చు. 2 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు అదనంగా చక్కెర తీసుకోవడం పూర్తిగా నివారించాలి. ఈ వయసులో శరీరం త్వరగా అభివృద్ధి చెందుతుంది. ఎక్కువ చక్కెర తీసుకుంటే అది శరీరానికి హానికరం. ఈ సమయంలో తీపి ఆహారాల బదులు సహజంగా ఉండే తీపిని ఉన్న పండ్లు ఇవ్వడం మంచిది. చక్కెర ఎక్కువగా తీసుకుంటే శరీరానికి అవసరమైన దాని కన్నా ఎక్కువ కేలరీలు అందుతాయి. ఇది శరీర బరువు పెరగడానికి కారణం అవుతుంది. అలాగే అధిక చక్కెర వల్ల రక్తంలో ట్రైగ్లిసరైడ్స్ స్థాయిలు పెరుగుతాయి. ఇది గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం కలుగజేస్తుంది. గుండె బలహీనపడుతుంది.చక్కెర ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల ఫ్యాటీ లివర్ అనే వ్యాధి వస్తుంది. ఇది కాలేయ పనితీరుపై ప్రభావం చూపుతుంది.



# బిజినెస్

## కాగ్నిజెంట్‌లో 25,000 మంది ఫ్రెషర్ల హైరింగ్




ఈ ఏడాది ప్రాంగణ నియామ కాల ద్వారా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ఫ్రెషర్లకు ఉద్యోగాలివ్వనున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ వెల్లడించారు. బలమైన మానవ వనరుల వ్యవస్థ నిర్మాణంతో పాటు గడిచిన రెండేళ్లలో పెరిగిన మేనేజ్డ్ సర్వీసెస్ ప్రాజెక్టులు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రాజెక్ట్ డెవల్‌పమెంట్‌కు మద్దతుగా ఫ్రెషర్ల నియామకాలను పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఫ్రెషర్ల నియామకాలతో పాటు ఏఐ ద్వారా ఉత్పాదకత పెంపు, మానవ వనరులను మరింత మెరుగ్గా వినియోగించుకోవడంపై దృష్టి సారించిందన్నారు. ఈ మార్చి 31 నాటికి కాగ్నిజెంట్‌లో మొత్తం 3,36,300 మంది ఉద్యోగులున్నారు. అందులో 85 శాతానికి పైగా కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. త్రైమాసిక ఆదాయం 510 కోట్ల డాలర్లు: మార్చితో ముగిసిన త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.45 శాతం పెరిగి 510 కోట్ల డాలర్లకు చేరింది. ఈ ఏడాది మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 2.6-5.1 శాతం నుంచి 3.9-6.4 శాతానికి పెంచింది. 2025లో మొత్తం 2050-2,100 కోట్ల డాలర్ల రాబడి నమోదు కావచ్చని సంస్థ అంచనా వేసింది.

## ఇక 15 సెకన్లలోనే యూపీఐ చెల్లింపులు




డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే యూపీఐ చెల్లింపుల ప్రక్రియ మరింత త్వరితం కానుంది. ప్రస్తుతం ఒక్కో యూపీఐ చెల్లింపు లావాదేవీ పూర్తయ్యేందుకు 30 సెకన్లు పడుతోంది. వచ్చే నెల 16 నుంచి ఇది 15 సెకన్లకు తగ్గనుంది. దీనికి సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గురువారం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తమ వ్యవస్థలను సిద్ధం (అప్‌డేట్) చేసుకోవాలని బ్యాంకులు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఎన్‌పీసీఐ ఆదేశించింది. మరోవైపు చెల్లింపులు, బదిలీలు, బ్యాలెన్స్ చెక్, పిన్ మార్పు వంటి ఏపీఐ రెస్పాన్స్ టైమ్‌ను బ్యాంకులు, పేమెంట్ యాప్స్ ఇక నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి. లేకపోతే చర్యలు తప్పవని ఎన్‌పీసీఐ హెచ్చరించింది. ఏటీఎం చార్జీల పెంపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు గురువారం నుంచి అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం ఒక నెలలో ఉచితంగా విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన పరిమితి దాటితే చేసే ఒక్కో లావాదేవీపై బ్యాంకులు రూ.23 చార్జీ చేయనున్నాయి. గతంలో ఈ చార్జీ రూ.21 ఉండేది. ఒక్కో లావాదేవీపై రూ.2 పెంచుకునేందుకు బ్యాంకులను అనుమతిస్తూ మార్చి 28న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేసింది. కస్టమర్ల ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలో ఉచిత లావాదేవీల (ఆర్థిక, ఆర్థికేతర) పరిమితి మెట్రో నగరాల్లో అయితే నెలకి మూడు కాగా నాన్ మెట్రో నగరాల్లో అయితే ఐదుగా ఉంది.

# పాక్ గగనతలం మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఎంత నష్టమో తెలుసా?




ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారతదేశం- పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత ప్రభావం ఇప్పుడు భారత కంపెనీలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ షేర్ల పతనం గురించి చర్చ జరిగింది. ఇప్పుడు రతన్ టాటాకు ఇష్టమైన కంపెనీలలో ఒకటైన ఎయిర్ ఇండియా గురించి కూడా చర్చ జరుగుతోంది. భారత విమానయాన సంస్థలకు పాకిస్తాన్ గగనతలం ఒక సంవత్సరం పాటు మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఏటా రూ. 50,000 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ వాదన రాయిటర్స్ నివేదికలో చేయబడింది. ఎయిర్ ఇండియా భారత ప్రభుత్వానికి ఒక లేఖ రాసి ఈ నష్టాన్ని ప్రస్తావించిందని రాయిటర్స్ పేర్కొంది. ఈ లేఖను తాను చూశానని, చదివానని రాయిటర్స్ పేర్కొంది. పాకిస్తాన్ గగనతలంపై నిషేధం ఒక సంవత్సరం పాటు కొనసాగితే ఎయిర్ ఇండియా దాదాపు $600 మిలియన్ల (50,400 కోట్లు)పైగా అదనపు ఖర్చులను ఎదుర్కోవాల్సి ఉంటుందని రాయిటర్స్ నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ నష్టాన్ని భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. గత వారం కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి ప్రతీకారంగా సింధు జల ఒప్పందాన్ని భారతదేశం నిలిపివేసిన తరువాత పాకిస్తాన్ తన వైమానిక ప్రాంతాన్ని ఆ దేశ విమానయాన సంస్థలకు మూసివేసింది. ఆ తరువాత భారతీయ విమానయాన సంస్థలు అధిక ఇంధన ఖర్చులు, సుదీర్ఘ ప్రయాణాలను ఎదుర్కోవలసి ఉంటుంది. దీని కారణంగా కంపెనీలు నిర్వహణ ఖర్చులను ఎదుర్కోవలసి రావచ్చు. ఏప్రిల్ 27న ఎయిర్ ఇండియా ఆర్థిక నష్టం గురించి భారత ప్రభుత్వానికి తెలియజేసింది. ఈ నిషేధం కారణంగా విమానయాన సంస్థకు ఏడాదికి రూ. 50 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు పంపిన లేఖలో ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రభావిత అంతర్జాతీయ విమానాలకు సబ్సిడీ మంచి ఎంపిక కావచ్చని లేఖలో పేర్కొన్నారు. పరిస్థితి మెరుగుపడితే సబ్సిడీని తొలగించవచ్చు. "విమానాశ్రయాల మూసివేతలు, అదనపు ఇంధన వినియోగం, అదనపు సిబ్బం ది కారణంగా ఎయిర్ ఇండియా ఎక్కువగా ప్రభావితమవుతుం ది. జు నివేదిక ప్రకారం.. ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారత విమానయాన సంస్థలపై గగనతల నిషేధం ప్రభావాన్ని అంచనా వేయమని ప్రభుత్వం తన అధికారులను కోరిన త ర్వాత ఎయిర్ ఇండియా లేఖ పంపినట్లు ఈ విషయంపై ప్రత్య క్ష అవగాహన ఉన్న ఒక మూలం తెలిపింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఈ విమానయాన సంస్థ ప్రభుత్వ యాజమాన్యంలో కొంతకాలం కొనసాగిన తర్వాత ఎక్కువ బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జిస్తోంది. బోయింగ్, ఎయిర్‌బస్‌ల నుండి జెట్ డెలివరీలలో జాప్యం కారణంగా అభివృద్ధి ఇప్పటికే దెబ్బతింది.

# దిగివస్తోన్న బంగారం ధర



నింగికంటిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. అమెరికా, చైనా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం సహా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగియనుందనే అంచనాలు పసిడి తగ్గుదలకు దోహదం చేస్తోన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,160 తగ్గి రూ.95,880కి దిగివచ్చింది. గుడ్‌రిటర్న్ సమాచారం ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,000 దిగివచ్చి రూ.87,900గా పలికింది. 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇటీవల తులం బంగారం ధర రూ.1 లక్ష దాటిన విషయం తెలిసిందే. కిలో వెండిపై రూ.2,000 తగ్గి రూ.98,000గా నమోదయ్యింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర దిగివస్తోంది. ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద నమోదయ్యింది. ఆల్‌టైం గరిష్ట స్థాయి 3,500 డాలర్ల నుంచి నుంచి 7 శాతం మేర తగ్గి 3,232 వద్ద పలికింది. ప్రపంచ మార్కెట్‌లో గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర దాదాపు 40 శాతం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు డాలర్ విలువ బలపడుతుండటం కూడా పసిడి ధర తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు తదితర అంశాలు బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. నింగికంటిన బంగారం ధరల వల్ల ఈ ఏడాది జనవరి మార్చి త్రైమాసికంలో భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మూడు నెలల కాలంలో బంగారం అమ్మకాలు 118.1 టన్నులకు పడిపోయాయి. పెట్టుబడుల డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో అభరణాల డిమాండ్ ఏకంగా 25 శాతం క్షీణించి 71.4 మెట్రిక్ టన్నులకు క్షీణించింది. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# విమర్శకుల నోళ్లు మూయించిన రోహిత్..



"ఏమీ మారలేదు, అంతా ఒకేలా ఉంది. నా పని బ్యాటింగ్ చేయడమే. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా, నా మొదటి పాత్ర బ్యాట్స్‌మన్‌గా, తరువాత కెప్టెన్‌గా ఉండేది. బ్యాట్స్‌మన్‌గా, నేను మ్యాచ్‌లను గెలవాలి. ఇప్పుడు నేను కెప్టెన్‌ని కానందున, నా పని జట్టుకు పరుగులు సాధించడం, మ్యాచ్‌లను గెలిపించడమే. అవసరమైన చోట నేను సహాయం చేస్తాను" అంటూ రోహిత్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025లో గురువారం ముంబై ఇండియన్స్ రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హాఫ సెంచరీతో అలరించాడు. అయితే, అంతకు ముందు ఫామ్‌లేమితో బాధపడ్డాడు. ఫామ్‌లో లేనప్పుడు విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ సీజన్‌లో 500-600 పరుగులు చేయనందుకు హిట్‌మ్యాన్‌పై కొంతమంది మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో ముంబై మాజీ కెప్టెన్ విమర్శకుల నోళ్లు మూయించేందుకు ఓ కీలక ప్రకటన చేశాడు. ఈ అనుభవజ్ఞుడైన కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ తన సొంత రికార్డుల కంటే ట్రోఫీలు తనకు చాలా ముఖ్యమైనవంటూ చెప్పుకొచ్చాడు. ఎన్ని పరుగులు కావాలంటే అన్ని పరుగులు చేయవచ్చని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను, కానీ వాటి విలువ జట్టు టోర్నమెంట్ గెలిచినప్పుడు మాత్రమే ఉంటుందని ఇచ్చిపడేశాడు. భారత వన్డే, టెస్ట్ కెప్టెన్ మాట్లాడుతూ, నేను 600-700 పరుగులు చేసినప్పుడు నాకు ఒక టోర్నమెంట్ ఉంటుంది. కానీ మా జట్టు టైటిల్ గెలవలేనప్పుడు అవన్నీ వృథానే అంటూ తేల్చిపారేశాడు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో రోహిత్ మాట్లాడుతూ, '2019 ప్రపంచ కప్‌లో, నేను 5 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ సహాయంతో 648 పరుగులు చేశాను. కానీ, సెమీ-ఫైనల్స్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయిన తర్వాత మేం టోర్నమెంట్ నుండి నిష్క్రమించాం. ఒకే సెషన్‌లో ఇన్ని పరుగులు సాధించడం నా లక్ష్యం కాదు. నేను గెలవాలని కోరుకుంటు న్నాను. నేను ఎల్లప్పుడూ నా ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటుంటాను' అని తెలిపాడు. ముంబై ఇండియన్స్ చరిత్రలో, ఏ బ్యాట్స్‌మన్ ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న పుడల్లా, ఆరెంజ్ క్యాప్ గెలవలేదంటూ విమర్శకుల నోరు మూయించేలా రోహిత్ ఆన్సర్ ఇచ్చాడు. వ్యక్తిగత ప్రదర్శన ట్రోఫీగా మారదంటూ ఎత్తి చూపాడు. 'నా 30 పరుగులు జట్టు విజయానికి సహాయపడుతున్నాయని నేను చెప్పడం లేదు' అని మాజీ ఎంఐ కెప్టెన్ అన్నారు. జట్టుకు ప్రయోజనం చేకూర్చేలా ఏదైనా అందించడంపైనే నా దృష్టి ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఇంతకుముందు నేను పరుగులు సాధించాలని అనుకునేవాడిని. కానీ, ఇప్పుడు అలా కాదు. ఎంఐ ట్రోఫీ గెలిచినప్పుడల్లా, మా జట్టు నుంచి ఏ ఆటగాడూ ఆరెంజ్ క్యాప్ గెలవలేకపోయాడని తెలిపాడు. దీంతో పాటు, కెప్టెన్సీని విడిచిపెట్టిన తర్వాత కూడా ఏమీ మారలేదని రోహిత్ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏమీ మారలేదు, అంతా ఒకేలా ఉంది. నా పని బ్యాటింగ్ చేయడమే. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా, నా మొదటి పాత్ర బ్యాట్స్‌మన్‌గా, తరువాత కెప్టెన్‌గా ఉండేది. బ్యాట్స్‌మన్‌గా, నేను మ్యాచ్‌లను గెలవాలి. ఇప్పుడు నేను కెప్టెన్‌ని కానందున, నా పని జట్టుకు పరుగులు సాధించడం, మ్యాచ్‌లను గెలిపించడమే. అవసరమైన చోట నేను సహాయం చేస్తాను. మా గత 3-4 సీజన్‌లు బాగా లేవు. అది మనం మార్చుకోవాల్సిన విషయం. దీని గురించి మేం మాలో వివరంగా చర్చించుకున్నాం. తప్పులు పునరావృతం కాకూడదు. మేం చాలా మంచి దశలో ఉన్నాం. ఈ సీజన్ మాకు మంచిది అవుతుంది" అని తెలిపాడు.

# స్పోర్ట్స్

## చెత్త ఆటతో తేలిపోయిన చెన్నై



ఐపిఎల్‌లో కళ్లు చెదిరే రికార్డు కలిగిన చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) సీజన్ 2025లో మాత్రం చెత్త ఆటతో అభిమానులను పూర్తిగా నిరాశ పరిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సిఎస్‌కె పేలవమైన ఆటతో తేలిపోయింది. వరుస ఓటములతో ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి ముంబై ఇండియన్స్ ఓడించి చెన్నై టైటిల్ వేటకు శ్రీకారం చుట్టింది. కానీ తర్వాతి మ్యాచుల నుంచి చెన్నై ఆట పూర్తిగా మారిపోయింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో చెత్త ప్రదర్శనతో వరుస ఓటములను చవిచూసింది. ఇతర జట్లతో పోల్చితే సిఎస్‌కె బ్యాటింగ్, బౌలింగ్ అంశాల్లో చాలా బలంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లు జట్టులో ఉన్నారు. అయినా చెన్నైకి చేదు అనుభవం తప్పలేదు. రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబె, రుతురాజ్ గైక్వాడ్, దీపక్ హుడా, సామ్ కరన్, మహేంద్ర సింగ్ ధోనీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. ఇంత మంది స్టార్లు జట్టుకు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోయింది. ఆటగాళ్లు తమవంతు పాత్రను సమర్థంగా పోషించక పోవడం చెన్నై దుస్థితికి కారణమని చెప్పాలి. రచిన్ రవీంద్ర ఆరంభంలో బాగానే ఆడినా తర్వాత తేలిపోయాడు. కెప్టెన్ రుతురాజ్ గాయం వల్ల టోర్నమెంట్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవాల్సి వచ్చింది. ధోనీ కూడా తన మార్క్ ఆటను కనబరచలేక పోయాడు. అతను కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినా జట్టుకు పెద్దగా ప్రయోజనం దక్కలేదు. జడేజా, అశ్విన్, దూబె తదితరులు తమ స్థాయికి తగ్గ ఆటను కనబరచలేక పోయారు. ఇక త్రిపాఠి, హుడాలు పూర్తిగా నిరాశ పరిచారు. కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా జట్టుకు అండగా నిలువలేక పోయారు. వీరి వైఫల్యం జట్టుపై బాగానే ప్రభావం చూపింది. హుడా, దీపక్‌లు చెత్త ఆటతో జట్టుకు భారంగా మారారు. ప్రపంచ శ్రేణి ఆల్‌రౌండర్ సామ్ కరన్ కూడా పూర్తిగా తేలిపోయాడు. బంతితో, బ్యాట్‌తో జట్టును ఆదుకోలేక పోయాడు. ఇలా కీలక ఆటగాళ్లందరూ తేలిపోవడంతో చెన్నై నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించక తప్పలేదు.

## భారత్‌కు మరో నాలుగు స్వర్ణాలు



ఆసియా అండర్-15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. గురువారంతో ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణ పతకాలు జమ అయ్యాయి. ఈ నాలుగు స్వర్ణ పతకాలు బాలికల విభాగంలోనే దక్కాయి. 46కిలోల విభాగంలో ఖుషీ చంద్ 3-2పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన అల్టానుంజుల్‌ను చిత్తుచేసి బంగారు పతకం చేజిక్కించుకుంది. 50కిలోల విభాగంలో అహానా శర్మ, 54 కిలోల విభాగంలో జన్నత్ ఉజ్బెకిస్తాన్ బాక్సర్లను 5-0పాయింట్లతో చిత్తుచేశారు. ఇక 80కిలోలకు పైబడిన విభాగంలో అషికా జోర్డాన్‌కు చెందిన జనాను ఓడించి భారత్‌కు 15వ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. అలాగే అండర్-17 విభాగంలో 60కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్, 63కిలోల విభాగంలో హర్షిక ఫైనల్లో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. చివరిరోజు భారత్‌కు నాలుగు స్వర్ణ, రెండు రజత పతకాలతో సహ మరో ఐదు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 43కు చేరింది. ఈ క్రమంలోనే భారత్ పతకాల పట్టికలో 2వ స్థానంలో నిలిచింది. ఇక కజకిస్తాన్ జట్టు అగ్రస్థానంతో, ఉజ్బెకిస్తాన్ జట్టు మూడో స్థానంలో ముగించాయి.



# ఆసక్తి కలిగిస్తున్న 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్

ప్రముఖ కమెడియన్, నటుడు ప్రవీణ్ త్వరలోనే భకాసుర అనే రెస్టారెంట్‌ను ప్రారంభించబోతున్నారు.. అనే న్యూస్ అందరిలోనూ కాస్త ఆసక్తి కలిగించి వైరల్‌గా మారింది. అయితే ప్రవీణ్ నటుడిగా బిజీగానే ఉన్నాడు కదా.. మరీ వ్యాపారంలోకి ఎందుకు వెళ్లుతున్నాడు అనే సందేహం కూడా అందరిలో కలిగింది. అయితే ఎట్టకేలకు ఇప్పుడు ఈ న్యూస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. ప్రవీణ్ ఎటువంటి రెస్టారెంట్‌ను పెట్టడం లేదు.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం పేరు 'భకాసుర రెస్టారెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రవీణ్ పెద్ద గరిటెతో వంట చేస్తుండటం.. ఆ పక్కనే ఇతర పాత్రలు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఆ పోస్టర్‌లోనే గమనిస్తే వైవా హర్ష, షైనింగ్ ఫణి మరో వైపు విచిత్రంగా సమ్‌థింగ్ స్పెషల్ పాత్రలుగా కనిపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్దమైంది.ప్రమోషనల్ భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ " హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్లను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా ఇది ఉండబోతుంది. నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య, ప్రాచీ ఠాకూర్, జబర్దస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీఓపీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తండ్.కె.వెంకటేష్, సంగీతం: వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ రాజా సీఆర్ తంగాల, పీఆర్ఓ: ఏలూరు శ్రీను, మదూరి మధు, నిర్మాతలు: లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి, దర్శకత్వం: ఎస్‌జే శివ.

# 'హిట్ 3'తో మరో హిట్

సాధారణంగా హీరోయిన్లు వరసపెట్టి సినిమాలు చేస్తుంటారు. కానీ హిట్ కొట్టేవాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఇలాంటి వాళ్లతో పోలిస్తే కాస్త భిన్నమైన హీరోయిన్ శ్రీనిధి శెట్టి. చేసింది తక్కువ సినిమాలే అయినా కేజీఎఫ్ ఫ్రాంచైజీతో బ్లాక్ బస్టర్ కొట్టింది. ఇప్పుడు 'హిట్ 3'తో మరోసారి సక్సెస్ అందుకుంది. సరే ఇవన్నీ పక్కనబెడిత ఇంతకీ శ్రీనిధి ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? ఈమె పూర్తి పేరు శ్రీనిధి రమేశ్ శెట్టి. మంగళూరులో పుట్టి పెరిగిన ఈమె తుళువ కమ్యూనిటీకి చెందిన అమ్మాయి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివింది. యాక్సెంచర్ కంపెనీలో జాబ్ తెచ్చుకుంది. ఇందులో జాబ్ చేస్తూనే మోడల్ గానూ పనిచేసింది. అలా 2016 మిస్ సూపర్ నేషనల్ అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ అవార్డ్ గెలిచిన రెండో దక్షిణాది అమ్మాయిగా రికార్డ్ కూడా సృష్టించింది. ఇలా మోడల్ గా చాలా పేరు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. ?అనుకోకుండా దర్శకుడు ప్రశాంత్ నీల్ దృష్టిలో పడింది. అలా కేజీఎఫ్ ఫ్రాంచైజీలో ఈమెని హీరోయిన్ గా తీసుకున్నాడు. స్వతహాగా ఇది హీరో సెంట్రిక్ సినిమా అయినప్పటికీ రీనా దేశాయ్ అనే పాత్రలో శ్రీనిధి నటన ఆకట్టుకుంది. అలా ఈమెకు పాన్ ఇండియా ఇమేజ్ వచ్చింది.

కేజీఎఫ్ 2 రిలీజైన కొన్నాళ్లకు తమిళంలో విక్రమ్ సరసన 'కోబ్రా' సినిమా చేసింది. ఇది తెలుగులో ఆడలేదు గానీ తమిళంలో మాత్రం మోస్తరు హిట్ గా నిలిచింది. 2022లో కోబ్రా చేసిన శ్రీనిధి.. దాదాపు మూడేళ్ల తర్వాత తెలుగులోకి 'హిట్ 3'తో పరిచయమైంది. హిట్ 3 కూడా హీరో సెంట్రిక్ యాక్షన్ మూవీ కావడంతో శ్రీనిధి శెట్టికి ఏమంత ప్రాధాన్య ఉండదులే అని చాలామంది అనుకున్నారు. స్టోరీకి అవసరమయ్యే పాత్ర ఈమెకు దక్కడం, మరోవైపు సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో శ్రీనిధి.. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బి ?అయిపోయింది. లెక్క ప్రకారం హిట్ 3 ఈమెకు మొదటి తెలుగు సినిమా కాదు. సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' కోసం ఈమెని హీరోయిన్ గా తీసుకున్నారు. ఈ మూవీ లాంచ్ ఈవెంట్ కి వచ్చిన నాని.. శ్రీనిధిని చూసి హీరోయిన్ ఛాన్స్ ఇచ్చాడు. దీంతో అసలు కంటే ఈ సినిమా ముందొచ్చింది. హిట్ కొట్టేసింది.

మరోవైపు హిందీలో భారీ బడ్జెట్ తో తీస్తున్న 'రామాయణ్'లోనూ శ్రీనిధినే సీతగా ఎంపిక చేశారు. కానీ రావణుడి పాత్ర కోసం యష్ వచ్చేసరికి.. ఈమెకి దక్కిన అవకాశం చేజారిపోయింది. సీత పాత్రలోకి సాయిపల్లవి వచ్చింది. ఏదేమైనా నిదానంగా సినిమాలు చేస్తున్న శ్రీనిధి శెట్టి.. చేసిన ప్రతి మూవీతోనూ హిట్ అందుకోవడం ఇక్కడ విశేషం.





# ప్రభాస్ అభిమానులు టెన్షన్ వద్దు..

## గుడ్ న్యూస్ అందించిన నిర్మాత

కల్కి చిత్రం తర్వాత ప్రభాస్ నుండి ఎలాంటి సినిమా రాలేదు. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజాసాబ్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటుండగా, ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభాస్ లిస్ట్‌లో ఇప్పుడు చాలానే సినిమాలు ఉన్నాయి. డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్?లో ఓ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ ప్రాజెక్ట్ తర్వాత ప్రశాంత్ నీల్ డైరెక్షన్లో సలార్ 2, నాగ్ అశ్విన్ తో కల్కి 2 చేయనున్నాడు. మధ్యలో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లోను ప్రభాస్ ఓ చిత్రం చేయనున్నాడు. స్పిరిట్ అనే టైటిల్‌కి ఈ చిత్రానికి పెట్టారు. సందీప్ రెడ్డి వంగా కొద్ది రోజుల క్రితం యానిమల్ సినిమాతో పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'యానిమల్' మూవీకి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' తెరకెక్కనుంది. అయితే, ఈ మూవీ తర్వాతే ప్రభాస్ 'స్పిరిట్' వస్తుందని.. దాని వలన స్పిరిట్ మరింత ఆలస్యం కానుందంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మూవీ నిర్మాత భూషణ్.. ప్రభాస్ మూవీ షూటింగ్ త్వరలోనే మొదలు కానుందని తెలియజేశారు. 2, 3 నెలల్లోనే ఈ మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2027లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్ తో కలిసి ఓ పవర్ పోలీస్ యాక్షన్ డ్రామాను రూపొందించనున్నారు. ఇందులో ప్రభాస్ పోలీస్ అవతారంలో చాలా పవర్ ఫుల్‌గా కనిపించనున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లాల్సి ఉంది. రాజాసాబ్ తర్వాత ప్రభాస్ స్పిరిట్ సినిమా కాకుండా ప్రశాంత్ వర్మతో చేయబోయే సినిమాలో జాయిన్ అవుతాడని జోరుగా ప్రచారాలు కూడా జరిగాయి. తాజాగా నిర్మాత క్లారిటీతో వీటన్నింటికి చెక్ పడ్డట్టు అయింది. 2027లో స్పిరిట్ సినిమా రిలీజ్ చేస్తామని నిర్మాత భూషన్ కుమార్ ప్రకటనతో ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఇటలీలో ఉన్న ప్రభాస్ ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత రాజాసాబ్ మూవీ కంప్లీట్ చేసి ఆ తర్వాత స్పిరిట్ మొదలు పెట్టనున్నట్టు సమాచారం.



# 'కింగ్డమ్' స్టోరీని రివీల్ చేసిన మొదటి పాట

విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీ 'కింగ్డమ్'. మే 30న థియేటర్లలోకి రానుంది. కొన్నిరోజుల ముందు వరకు సినిమా వాయిదా పడుతుందని రూమర్స్ వినిపించాయి. కానీ తాజాగా పాటతో ప్రమోషన్స్ తో మొదలుపెట్టడంతో పుకార్లకు చెక్ పడింది. ఇప్పుడు ఆ పాటని రిలీజ్ చేశారు. 'హృదయం లోపల..' అంటూ సాగే ఈ గీతంలో కింగ్డమ్ సినిమా కథేంటి అనేది కొంతలో కొంత రివీల్ చేశారని చెప్పొచ్చు. సూరి అనే రౌడీ, ?అతడితో ప్రేమలో ఉన్న ఓ డాక్టర్.. వీళ్లిద్దరూ కలిసి శ్రీలంక ఆర్మీపై ఏదో ప్లాన్ చేస్తున్నట్లు కనిపించారు. అదేంటి అనేది మాత్రం సినిమా చూసి తెలుసుకోవాలి. కింగ్డమ్ సినిమాలో సూరి అనే పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించాడు. అతడి ప్రేయసిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈ పాటలో ఓవైపు చంపడం చూపిస్తూనే, చివర్లో రొమాన్స్ కూడా చూపించారు. సినిమా కూడా అటు యాక్షన్, ఇటు రొమాన్స్ అనేలా ఉంటుందని హింట్ ఇచ్చారేమో?

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com